1
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
శుక్రవారం | సెప్టెంబర్ 15, 2023 | www.navatelangana.com

పండుగల వేళ.. వదంతులు నమ్మొద్దు

నవతెలంగాణ-నవీపేట్


మాట్లాడుతున్న సీఐ

పండుగల వేళ.. సోషల్‌మీడియాలో వ్యాప్తి చెందే వదంతులు నమ్మొద్దని రూరల్ సీఐ సతీశ్ అన్నారు. మండల కేంద్రంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శాంతి కమిటీ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. వినాయక మండపాల నిర్వాహకులు ముందస్తు జాగ్రత్తలు తీసుకొని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని అన్నారు. ప్రతి సంవత్సరం లాగే మతసామరస్యంతో వ్యవహరించి వినాయక నిమజ్జనంలో ఎటువంటి అపశృతులు జరగకుండా చూసుకోవాలని ఏవైనా సమస్యలు ఉంటే పోలీస్ శాఖ దృష్టికి తీసుకురావాలని అన్నారు. కార్యక్రమంలో తహసిల్దార్ ధన్వాల్, ఎంపీడీవో సాజిద్ అలీ, సొసైటీ చైర్మన్ అబ్బన్న, బుచ్చన్న, తాహెర్, నవీన్ రాజ్, రాజేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అవి మోడీ నోటీసులు

- రాజకీయ కక్షతోనే ఈడీ నోటీసులు.. టీవీ సీరియల్‌లా ఏడాది నుంచి సాగదీత : ఎమ్మెల్సీ కవిత ధ్వజం

నవతెలంగాణ-కంఠేశ్వర్


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

'నాకు ఈడీ నుంచి కాదు.. మోడీ నుంచే నోటీసులు వచ్చాయని, రాజకీయ కక్షతో పంపించిన నోటీసు కాబట్టి దానిపై పెద్దగా స్పందించాల్సిన అవసరం లేదని' ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఈడీ నోటీసును తమ పార్టీ న్యాయ విభాగానికి ఇచ్చామని, ఆ విభాగం ఎలా చెబితే అలా ముందుకెళ్తామని తెలిపారు. గురువారం ఆమె నిజామాబాద్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

వివరాలు మెయిన్‌లో..


నివాళి అర్పిస్తున్న నాయకులు, పేదలు

వీర తెలంగాణ సాయుధ పోరాటానికి వారసులు కమ్యూనిస్టులే

- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పద్మ

నవతెలంగాణ-భిక్కనూర్

వీర తెలంగాణ సాయుధ పోరాటానికి వారసులు కమ్యూనిస్టులే అని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పద్మ తెలిపారు. గురువారం మండలంలోని జంగంపల్లి గ్రామంలో మల్లు స్వరాజ్యం కాలనీలో వీర తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి పద్మ మాట్లాడుతూ భూమి కోసం భుక్తి కోసం పేద ప్రజల విముక్తి కోసం జరిగిన ఈ సాయుధ పోరాటంలో కమ్యూనిస్టులు, నాయకులు, కార్యకర్తలు, రైతులు, ప్రజలు అమరవీరులయ్యారని సాయుధ పోరాటంలో పాల్గొన్న అమరుల రక్తపు మరకలు ఇప్పటికీ చెదరకుండా ఉన్నాయన్నారు. సాయుధ పోరాటంలో పాల్గొన్న మల్లు స్వరాజ్యం గారి పేరుతో కాలనీ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఎర్రజెండా ఆధ్వర్యంలో 3000 గ్రామాల విముక్తి చేసి 10 లక్షల ఎకరాల భూమి పంచిన ఘనత కమ్యూనిస్టులకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటీయు జిల్లా కన్వీనర్ చంద్రశేఖర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొత్త నరసింహులు, నాయకులు ప్రవీణ్, నరసవ్వ, బాల్ రాజ్, రవి, శ్యామల, రమణ, కవిత, బాలమణి పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం

- కుల వృత్తులకు ఇతోధికంగా ప్రోత్సాహం
- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్
- పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ/కంఠేశ్వర్, మోపాల్, డిచ్‌పల్లి



డిచ్‌పల్లిలో చేపల మార్కెట్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి.. న్యాల్‌కల్‌లోని చెరువులో చేప పిల్లల విడుదల

కుల వృత్తులను ప్రోత్సహిస్తూ, పేదల అభ్యున్నతికి పాటుపడడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ప్రభుత్వం ముందుకెళ్తోందని రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమ అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖామాత్యులు తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని అర్సపల్లిలో రూ. రెండు కోట్లతో, డిచ్‌పల్లి మండలం నడిపల్లిలో రూ. యాభై లక్షలతో చేపడుతున్న చేపల మార్కెట్ల నిర్మాణాలకు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ గురువారం అట్టహాసంగా శంకుస్థాపనలు చేశారు. అదేవిధంగా మోపాల్ మండలం న్యాల్కల్ గ్రామంలోని మాసాని చెరువులో చేప పిల్లలను విడుదల చేసి, మత్స్యకారులతో భేటీ అయ్యారు. మత్స్య కార్మిక సంఘాల సభ్యులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో శాసన మండలి సభ్యురాలు కల్వకుంట్ల కవిత, రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ చైర్మన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా, మత్స్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆధర్ సిన్హా, కమిషనర్ లచ్చిరాం నాయక్, జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, నగర మేయర్ నీతూకిరణ్ తదితరులు మంత్రితో కలిసి పాల్గొన్నారు. మత్స్య కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంత్రికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ, సమైక్య రాష్ట్రంలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన మత్స్య కార్మికులను ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రస్తుతం అన్ని విధాలుగా ఆదుకుంటున్నారని అన్నారు. నీటి వనరులు ఉన్న ప్రతి చోటా వంద శాతం సబ్సిడీపై చేపలు, రొయ్యల పెంపకానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవడం వల్ల చేపల సంపద గణనీయంగా వృద్ధి చెందిందని అన్నారు.

మత్స్య కార్మికులకు రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు లక్షల మందికి గుర్తింపు కార్డులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. 2016 లో మొదటగా 3900 చెరువుల్లో చేప పిల్లల పెంపకానికి శ్రీకారం చుట్టిన ప్రభుత్వం, ప్రస్తుతం 24 వేల పైచిలుకు చెరువుల్లో చేప పిల్లలను విడుదల చేస్తూ రాష్ట్రంలో చేపల సంపదను రెట్టింపు చేసి మత్స్యకార కుటుంబాలలో వెలుగులు నింపుతోందని అన్నారు. పేద ప్రజల సంక్షేమమే పరమావధిగా రాష్ట్ర ముఖ్యమంత్రి అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. సేద్యానికి 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందించడంతో పాటు రైతుబంధు, రైతు బీమా, సాగునీరు అందిస్తూ రైతాంగానికి ఆదరువుగా నిలుస్తున్నారని అన్నారు. కుల వృత్తులను ఆర్థికంగా బలోపేతం చేయుటకు ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తున్నదని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా వృద్ధులు, వితంతువులు, బీడీ, చేనేత కార్మికులు తదితరులకు రూ. 2,016, దివ్యంగులకు రూ. 4,016 ఆసరా పింఛన్లు అందిస్తున్నదని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పేదింటి ఆడపిల్ల పెళ్ళికి కళ్యాణలక్ష్మి, షాదిముబారక్ ద్వారా లక్షా 116 రూపాయలు అందిస్తున్నది తెలంగాణలో మాత్రమేనని అన్నారు. అన్ని వర్గాల అభ్యున్నతికి పాటుపడుతున్న ప్రభుత్వానికి ప్రజలు వెన్నుదన్నుగా నిలువాలని మంత్రి కోరారు.

ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ, సమైక్య రాష్ట్రంలో దుర్భర స్థితిలో కొట్టుమిట్టాడిన మత్స్యకార కుటుంబాలు, స్వరాష్ట్రంలో కేసీఆర్ పాలనలో ఆర్థిక పరిపుష్టి సాధిస్తున్నారని అన్నారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు చెరువులన్నీ కబ్జాలకు గురయ్యాయని, మత్స్య కార్మికులు చేపలు పట్టుకుందామంటే చెరువులలో నీటి జాడ ఉండేది కాదన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో దూరదృష్టితో మిషన్ కాకతీయ కింద చెరువులను మరమ్మత్తులు చేసిన ఫలితంగా ప్రతి చోటా చెరువులు జలకళతో తొణికిసలాడుతున్నాయని, 100 శాతం సబ్సిడీపై చేప పిల్లలను ప్రభుత్వం అందిస్తూ, వాటి సంపదను పూర్తిగా మత్స్య కార్మికులకే అందిస్తోందన్నారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని మోపాల్, సిరికొండ తదితర ప్రాంతాల్లోనూ ఫిష్ మార్కెట్లు మంజూరు చేయాలని కోరగా, మంత్రి తలసాని సానుకూలంగా స్పందించారు.

కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ, జిల్లాలో 1118 చెరువులలో చేప పిల్లలను విడుదల చేస్తూ, మత్స్య సంపదను పెంపొందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. గత సంవత్సరం 866 చెరువుల్లో చేప పిల్లల పెంపకం జరుగగా, ఈ ఏడాది 1118 చెరువుల్లో 470 లక్షల చేప పిల్లలు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నామని అన్నారు. మత్స్యకారులను ఆర్థిక పురోభివృద్ధి దిశగా ప్రోత్సహించేందుకు సుమారు రూ. 21 కోట్ల రూపాయల విలువ చేసే మోపెడ్ లు, వాహనాలు, ఇతర సదుపాయాలను సమకూర్చడం జరిగిందన్నారు.

ఈ సందర్భంగా నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో సమీకృత మత్స్య అభివృద్ధి పథకం ద్వారా 20 ద్విచక్ర వాహనాలు, 75 శాతం రాయితీపై రూ. 11.55 లక్షల విలువ చేసే లగేజీ ఆటో రిక్షాను మంత్రి చేతుల మీదుగా లబ్దిదారులకు పంపిణీ చేశారు. న్యాల్కల్ లోని మాసాని చెరువులో 2.74 లక్షల చేప పిల్లలు, 1.37 లక్షల రొయ్య పిల్లలు విడుదల చేశారు. ఈ కార్యక్రమాల్లో మత్స్య కార్మిక ఫెడరేషన్ అధ్యక్షుడు టి.మల్లయ్య, ఐడీసీఎంఎస్ చైర్మన్ మోహన్, నుడా చైర్మన్ ఈగ సంజీవరెడ్డి, జెడ్పిటిసి బాజిరెడ్డి జగన్, ఎంపీపీ బాదవత్ రమేష్ నాయక్, ఒలింపిక్ సంఘం జిల్లా అధ్యక్షులు, నూడ చైర్మన్ ఈగ సంజీవ్ రెడ్డి,జడ్పీ టీసి దాసరి ఇందిరా లక్ష్మీ నర్సయ్య బిఆర్ఎస్ మండల అధ్యక్షులు చింత శ్రీనివాస్ రెడ్డి, చిలువేరి గంగా దాస్, సీనియర్ నాయకులు శక్కరి కొండ కృష్ణ, మోహమ్మద్ యూసఫ్,కో ఆప్షన్ సభ్యులు షేక్ నయీమ్, మోహన్ రెడ్డి, ఎంపిటిసి ల ఫోరం అధ్యక్షులు సాయిలు,లోలం సత్యనారాయణ, పాపాయి తిరుపతి, షేక్ అమీర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

మురుగు నిల్వకుండా చూడాలి

నవతెలంగాణ-తాడ్వాయి

గ్రామంలో మురికినీరు నిలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీవో రాజీవ్ర్ తెలిపారు. తాడ్వాయి మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలో మురికినీటితో నిండిన గుంతలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో మురికి నీరు నిలువుంటే ప్రజలు రోగాల బారిన పడతారని హెచ్చరించారు. మురికినీరు నిల్వ ఉండడంతో ఈగలు దోమలకు ఆవాసంగా మారి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. వెంటనే మురికినీటి గుంటలను తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జంగి ఇందిరా రాజయ్య, కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎంపీ, పీఎంపీ సెంటర్‌లకు అనుమతుల్లేవ్

- సూదులు ఇస్తూ ఇన్‌జక్షన్‌లు ఇవ్వడంపై మెడికల్ ఆఫీసర్ ఆగ్రహం

నవతెలంగాణ-పిట్లం


ఫస్ట్‌ఎయిడ్ సెంటర్‌లలో వైద్యాధికారి తనిఖీలు

పిట్లం మండల కేంద్రంలో 22 ప్రథమ చికిత్స కేంద్రాలకు గాను , కేవలం నాలుగింటికి మాత్రమే ప్రభుత్వ అనుమతులు ఉండగా మిగతా వాటికి ఎలాంటి అనుమతులు లేకుండా అనధి కారికంగా నిర్వహిస్తున్నారని మెడికల్ ఆఫీసర్ శివ కుమార్ తెలిపారు. ఆర్ఎంపి, పిఎంపి ప్రాక్టీషనర్లు రోగులకు ఇంజక్షన్, గ్లూకోజ్ నిర్వహించడం దారుణమన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఆర్ఎంపి, పిఎంపి ప్రథమ చికిత్స కేంద్రాలను తనిఖీ నిర్వహించారు. ఆర్ఎంపి, పీఎంపీ ప్రాక్టీషనర్లు ఆపరేషన్లు నిర్వహించడం చట్టరీత్యా నేరమని అన్నారు. జిల్లా వైద్యాధికారి ఆదేశాల మేరకు కేంద్రాలను తనిఖీ నిర్వహించడం జరిగిందన్నారు.

ఇటీవల ఆర్ఎంపి వైద్యుడు రాజు రెండు నెలల పసి గుడ్డు బాబుకు చేసిన వైద్యం వికటించడంతో పసి గుడ్డు మృతి చెందాడని అన్నారు. అర్హత లేకున్నప్పటికీ స్థాయిని మించి ఆపరేషన్లు, గ్లూకోజ్ లాంటి వైద్య పనులను నిర్వహించకూడదని మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. త్వరలో జిల్లా అధికారుల చేతుల మీదుగా ఆర్.ఎం.పి , పి.ఎం.పి ప్రథమ చికిత్స కేంద్రాలకు నోటీసులు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది విజయ్ కుమార్ , సిద్ధి రామ గౌడ్ , శ్యామ్ రావు తదితరులు పాల్గొన్నారు.

డిమాండ్‌లు పరిష్కరించుకుంటే 25 నుంచి సమ్మెకెళ్తాం

- సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశాల సమ్మె నోటీసు అందజేత

నవతెలంగాణ-కంఠేశ్వర్


సమ్మె నోటీసు అందజేస్తున్న ఆశాలు, నాయకులు

ఆశాలకు పారితోషికం రూ.18 వేలకు పెంచి ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలని, జాబ్ చార్ట్ విడుదల చేయాలని, ఇతరాత్ర సమస్యలు పరిష్కరించాలని లేకుంటే ఈ నెల 25వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్తామని ఆశాలు స్పష్టంచేశారు. గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో డిఎంహెచ్ ఓ సుదర్శనమ్‌కు సమ్మె నోటీసు అందజేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ.. ఆశాలు పనిచేస్తున్న వారంతా బడుగు బలహీనవర్గాలకు చెందిన వారని, ప్రారంభం నుంచి ఇప్పటి వరకు పని చేస్తూ ప్రభుత్వం నిర్వహించిన అనేక ట్రైనింగ్‌లు పొందినట్లు తెలిపారు. రిజిస్టర్స్ రాయడం, సర్వేలు చేయడం, ఆన్లైన్ పని చేయడం, బిపి, షుగర్, థైరాయిడ్ తదితర అన్నిరకాల జబ్బులను గుర్తిస్తున్నారని తెలిపారు. వీటితో పాటు గర్భిణీ, బాలింతలు, చిన్నపిల్లలకు, ఇతర ప్రజలకు సేవలందిస్తున్నారు. కరోనా మహమ్మారి కాలంలో కరోనాను నియంత్రించడంలో ఆశా వర్కర్లు కీలకపాత్ర పోషించారని, డబ్ల్యుహెచ్, ప్రపంచ ఆరోగ్య సంస్థ హెల్త్ గ్లోబల్ లీడర్స్ అని ఆశా వర్కర్లకు అవార్డును కూడా ప్రకటించిందనపి తెలిపారు. ఇన్ని పనులు నిర్వహిస్తూ పేద ప్రజలకు సేవలందిస్తున్న ఆశాలకు నేటికీ ఫిక్స్ వేతనం నిర్ణయించలేదని, పనిభారం మాత్రం గతంతో పోలిస్తే పెరిగిందని అన్నారు. ప్రతిరోజు ఉదయం 9 నుండి సాయంత్రం 5 గంటలు వరకు సబ్ సెంటర్స్, బస్తీ దవాఖానాల్లో పని చేయాలని ఆశాలకు ప్రభుత్వం చెప్తున్నదని, ఇంత పని చేస్తున్న ఆశాలకు కేవలం రూ. 9,750/-లు పారితోషికాలు మాత్రమే ప్రభుత్వం చెల్లిస్తున్నట్టు తెలిపారు. ఇవి కూడా అందరికీ రావడం లేదని అన్నారు. ఆశాల పారితోషికాలను రూ.18,000/-లకు పెంచి ఫిక్స్‌డ్ చేతనం నిర్ణయించాలని, డిమాండ్ చేశారు జిల్లా వ్యాప్తంగా ఆశా వర్కర్లు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. కార్యక్రమంలో రేణుక, సుకన్య, రేవతి, తో పాటు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్నం.. ఇంటి భోజనమే

- మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మెను పట్టని పాలకులు
- స్కూళ్లోకి రాకుండా మీడియాపై ఆంక్షలు



హాస్టల్‌కు నడుచుకుంటూ వెళ్తున్న విద్యార్థులు

నవతెలంగాణ-రామారెడ్డి

పెండింగ్‌లో ఉన్న బిల్లులు వెంటనే చెల్లించాలని, మెస్ చార్జీలు పెంచాలని తమ డిమాండ్ల కోసం మధ్యాహ్న భోజన నిర్వాహకులు సమ్మెకు వెళ్లగా, విద్యార్థులు ఇంటి నుంచే మధ్యాహ్నం భోజనం తీసుకెళ్లి భోజనం చేస్తున్నారు. మండల కేంద్రంలోని షెడ్యూల్ కులాల వసతి గృహంలో ఉంటున్న విద్యార్థులు వసతి గృహము నుండి పాఠశాల దాదాపు 1.5 కిలోమీటర్ దూరం ఉండటం, మధ్యాహ్నం ఒక గంట లోపల నడుచుకుంటూ వెళ్లి, భోజనం చేసి మళ్ళీ తిరిగి రావాలంటే ఇబ్బందిగా మారింది.

వివరాలు మెయిన్‌లో..

వినాయకుల బావి పూడికతీత

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



వినాయక చవిత పండుగ వస్తున్న నేపథ్యంలో వినాయకుల బావిలో పూడిక తీత పనులు కొనసాగుతున్నాయి. మున్సిపల్ ఆధ్వర్యంలో ఐదు రోజులుగా పనులు చేపట్టారు. గతేడాది వినాయక విగ్రహాలను ఈ బావిలో నిమజ్జనం చేయగా.. వాటి వ్యర్థాలను, మట్టిని తొలగించే పనులు చేపట్టారు. వ్యర్థాలను తరలించనున్నారు. తదనంతరం నీటితో బావిని నింపనున్నారు.

సమ్మె విచ్చిన్నానికి విశ్వయత్నాలు

- గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో పిల్లలకు భోజనం
- సమ్మె ప్రభావం కనబడకూడదన్న దురుద్దేశం
- మహిళా సంఘాల వివోఏ లను పావులుగా వాడుకుంటున్న అధికారులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీ ఉద్యోగులు నిరవధిక సమ్మె చేస్తుంటే.. మరో పక్క ప్రభుత్వం సమ్మె విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నాలు చేస్తుంది. అంగన్‌వాడీ ఉద్యోగులు సమ్మె ప్రారంభించిన క్షణమే ఒక్కరోజైనా ఓపిక పట్టకుండా అదే రోజు గ్రామాల్లో అంగన్వాడి కేంద్రాల తాళాలను అధికారులు గ్రామ పంచాయతీ కార్యదర్శుల చేత పగలగొట్టించారు. కేంద్రాల్లో నిలువ ఉన్న వంట సరుకులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కేంద్రాలకు పంచాయతీ కార్యదర్శుల చేత సొంత తాళాలను వేయించారు. తద్వారా అంగన్వాడి ఉద్యోగులను భయభ్రాంతులకు గురి చేసేందుకు అధికారులు ప్రయత్నించారు. కానీ అంగన్‌వాడీలు ఐక్యంగా ఉద్యమిస్తున్నారు.

సమ్మె ప్రభావం ప్రజల్లో కనిపించకూడదన్న దురుద్దేశంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు గ్రామాల్లో మహిళా సంఘాల వివోఏలను పావులుగా వాడుకుంటున్నారు. వారి చేత అంగన్‌వాడీ కేంద్రాల వద్ద వంట చేయించి, చిన్నారులకు భోజనం అందించడం ద్వారా అంగన్వాడి ఉద్యోగులు లేకున్నా అంగన్వాడి కేంద్రాల నిర్వహణ ఎక్కడ ఆగలేదన్న సంకేతాన్ని ప్రజలకు ఇచ్చేందుకు ప్రభుత్వం, అధికారులు పడరాని పాట్లు పడుతున్నారు. అంగన్వాడి కేంద్రాలను నిర్వహించి, చిన్నారులకు భోజనం అందించేందుకు మహిళా సంఘాల వివోఏలు సిద్ధంగా లేమని ససేమీరా అన్నా అధికారులు వారిపై ఒత్తిడి తెచ్చి కొన్నిచోట్ల వంట చేయిస్తున్నారు. గతంలో తాము సమ్మె చేస్తే అంగన్వాడి ఉద్యోగులు మద్దతు ఇచ్చిన నేపథ్యంలో ప్రస్తుతం అంగన్వాడీ ఉద్యోగులు సమ్మె చేస్తున్నందున తాము అంగన్వాడి కేంద్రాలను నిర్వహించడం బాగోదని పేర్కొన్న ఉన్నతాధికారులు వారిపై ఒత్తిడి తెచ్చినట్లు తెలుస్తోంది. దీంతో గత్యంతరం లేక పలుచోట్ల మహిళా సంఘాల వివోఏలు గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో భోజనాలు వండి, చిన్నారులకు ఆహారాన్ని అందిస్తున్నారు. ఏదో ఒకటి రెండు రోజులైతే తాము అధికారులకు సహకరించగలము గాని, సమ్మె కొనసాగినంత కాలం అంగన్వాడి కేంద్రాల చిన్నారులకు ఆహారం అందించాలంటే మాకు మాత్రం కుదరదని పలువురు వివోఏలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఏదో కొంతమంది చిన్నారులకు ఆహారాన్ని అందిస్తున్న, గర్భిణీలు, బాలింతల పరిస్థితి ఏంటి అని వివోఏలే అధికారులను ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వమే స్పందించి అంగన్వాడీ ఉద్యోగుల సమ్మె విరమణకు ప్రయత్నిస్తే బాగుంటుందని పేర్కొంటున్నారు.


మండలంలోని బషీరాబాద్‌లోలో చిన్నారులకు భోజనం వడ్డిస్తున్న సీసీలు

బషీరాబాద్‌లో..

మండలంలోని బషీరాబాద్‌లో గురువారం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాల చిన్నారులకు భోజనాలను అందించారు. మహిళా సంఘాల వివోఏలతో భోజనాన్ని సిద్ధం చేయించి, చిన్నారులకు వడ్డించారు. గ్రామ సర్పంచ్ సక్కారం అశోక్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ స్వయంగా పర్యవేక్షించడం ద్వారా నిరవధిక సమ్మెతో ఉద్యోగులు అంగన్వాడి కేంద్రాలు మూసిన చిన్నారులకు తాము గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో పౌష్టికాహారం అందిస్తున్నామని ప్రజలకు చెప్పే ప్రయత్నం చేశారు.

కుటుంబ అవినీతి పాలనతో రాష్ట్రం రెండు దశాబ్దాల వెనక్కు

- ఎంపీ అరవింద్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

కల్వకుంట్ల కవిత లాంటివాళ్ళు సమాజానికి చెదపురుగుల లాంటివాళ్ళు అని, ఇటువంటి వాళ్ల రాష్ట్ర పురోగతికి ప్రధాన అడ్డంకి అని వీళ్ళ కుటుంబం చేసిన అవినీతి వల్ల తెలంగాణ రాష్ట్రం రెండు దశాబ్దాల పాటు వెనుకకు వెళ్ళిపోయిందని ఎంపీ అరవింద్ ధ్వజమెత్తారు. ఇటువంటి వాళ్ళు ఎంత తొందరగా నేరారోపణ రుజువై దోషిగా తేలితే చట్టం వీళ్ళని రాజకీయాల నుండి బయటికి తరిమేస్తే సమాజానికి అంత మేలవుతుందని అన్నారు. మోడీ నోటీసులంటూ గురువారం ఎమ్మెల్సీ కవిత చేసిన వ్యాఖ్యలపై ఎంపీ స్పందించారు. కవిత చెడు పనులకు ఈడీ ఆమెకు నోటీసులు పంపిస్తే , వాటిని మోడీ నోటీసులుగా వర్ణించడం ఆమె పరాకాష్ట మాటలకు నిలువెత్తు నిదర్శనం అని అన్నారు. త్వరలో నిజానిజాలు ప్రజలకు తెలుస్తాయని, దోషులకు శిక్ష పడుతుందని అన్నారు.

విలేకరులు కావలెను

నవతెలంగాణ

తెలుగులో తప్పులు లేకుండా రాయగలిగి, సామాజిక స్పృహతో స్పందించే ఉత్సాహం.. అవినీతి, అక్రమాలను వెలికితీసే ధైర్యం, ప్రశ్నించేతత్వం, ప్రజాసమస్యలను వెలికితీసి పాత్రికేయ వృత్తిలో రాణించాలనే ఆసక్తి మీలో ఉందా..? ఆ అవకాశాన్ని 'నవతెలంగాణ' కల్పిస్తోంది. ఖాళీ మండలాల్లో భర్తీకి ఆహ్వానిస్తోంది

ఖాళీ మండలాలు

నిజామాబాద్ జిల్లా

1. రుద్రూర్ 2. ఆలూర్, 3. డొంకేశ్వర్ 4. పోతంగల్

కామారెడ్డి జిల్లా

1. కామారెడ్డి, 2. బాన్సువాడ 3. బీర్కూర్ 4. బీబీపేట్, 5. నాగిరెడ్డిపేట్

డెస్క్‌లో విధులు నిర్వర్తించేందుకు సబ్‌ఎడిటర్/ఆపరేటర్ కావలెను

ఇంటర్వ్యూ తేదీ : 17.09.2023
సమయం : ఉదయం 10.30 గంటలకు

అడ్రస్ : నవతెలంగాణ దినపత్రిక కార్యాలయం సుభాష్‌నగర్. ఎస్‌బిఐ పక్కన, నిజామాబాద్.

సంప్రదించాల్సిన నెంబర్లు :
9494573764, 9490099408

అక్షరయాన్ బాలిక పురస్కారం అందుకున్న వైష్ణవి



నవతెలంగాణ-ఏర్గట్ల

తడపాకల్ గ్రామానికి చెందిన దేగల వైష్ణవి 2022 సంవత్సరానికి గాను అక్షరయాన్ బాలిక పురస్కారం లభించినట్లు తెలుగు పండితులు ప్రవీణ్ శర్మ తెలిపారు. అమ్మ సరళ, వచన శతకం, చదవు సరళ వచన శతకం రచించి, చిన్నతనం నుండే సాహిత్యం పట్ల మక్కువ చూపించినందుకు అక్షరయాన్ సంస్థ వ్యవస్థాపకురాలు అయినంపూడి లక్ష్మీ వైష్ణవిని ఎంపిక చేశారని ప్రవీణ్ శర్మ తెలిపారు. ఈ పురస్కారాన్ని ఈ నెల 23 న పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో ప్రముఖుల చేత ఇవ్వబడుతుందని, దీంతో పాటు నగదు బహుమతి, ప్రశంసపత్రం, మెమెంటోను అందుకోబోతుందని తెలుగు పండితులు తెలిపారు.

విజయ్ విద్యార్థుల వ్యవసాయ క్షేత్ర సందర్శన



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఫీల్డ్ ట్రిప్లో భాగంగా విజయ్ హైస్కూల్ 8వ తరగతి విద్యార్థులు ఆదర్శరైతు చిన్నికృష్ణుడు వ్యవసాయక్షేత్రాన్ని గురువారం సందర్శించారు. సోమసూత్ర ప్రదక్షణ ఆకారంలో ఏర్పాటు చేయబడిన వరి పంటకు ప్రదక్షణ చేస్తూ.. పంటపొలాన్ని చూసి ఆనందానుభూతిని పొందారు. తన వ్యవసాయక్షేత్రంలో రకరకాల, రంగురంగుల ఆరోగ్యకరమైన వరిధాన్యం పండిస్తూ... తోటి రైతులకు వరి వంగడాలను అందిస్తూ... ఆదర్శరైతుగా నిలిచిన చిన్నికృష్ణుడు వరి వంగడాల విశిష్టతని విద్యార్థులకు వివరించారు. చిన్నికృష్ణుడు ఈ మధ్యనే 'ఇందూరు అపురూప అవార్డు' అందుకున్నారు.

కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను
వెంటనే రెగ్యులరైజ్ చేయాలి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రెగ్యులరైజ్ చేయాలని, బాన్సువాడ డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్ అసోసియేట్ ప్రొఫెసర్ ఇందూరు గంగాధర్ సంఘీభావం ప్రకటించారు. యూనివర్సిటిలో పనిచేస్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్ కాంట్రాక్ట్ 11వరోజు రిలేదీక్షలలో భాగంగా ఆయన పాల్గొని సంఘీభావం ప్రకటించి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 12 యూనివర్సిటీలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను ప్రభుత్వం వెంటనే రెగ్యులరైజ్ చేయాలని కోరారు. తరగతి గదిలో బోధించే అసిస్టెంట్ ప్రొఫెసర్ బయటకు వచ్చి నిరసన తెలియజేయడం సబబుకాదన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, పలువురు పాల్గొని సంఘీభావం ప్రకటించారు.

ముదిరాజ్‌లను
బీసీ-డీ నుండి బీసీ-ఏలోకి మార్చాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

బీసీ-డీ నుండి బీసీ-ఏలో ముదిరాజ్ కులస్థులను మార్చాలని ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం వారు విడుదల చేసిన జీవో ప్రకారం ముదిరాజ్ కులస్థులకు చేపలు పట్టడానికి సొసైటీ సభ్యత్వం కల్పించే విధంగా , జనాభా ప్రాతిపాదికన ముదిరాజ్ లకు చట్ట సభలో స్థానం కల్పించాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ, నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు మెతుకు శివకుమార్ ముదిరాజ్ కోరారు. గురువారం ఎమ్మెల్సీ కవితకు వినతిపత్రం అందజేసి ఆయన మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రం, ప్రస్తుతం ఉన్నటువంటి ప్రభుత్వం జీ.వో. నం.15, తేది: 19.02.2009 ప్రకారం ముదిరాజ్ కులస్థులను బీసీ-డీ నుండి బీసీ-ఏ లోకి మార్చాలని, జీ.వో. నం. 98 1964 ప్రకారం ప్రభుత్వం, జీ.వో. నం. 06 2015 ప్రకారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, జీ.వో. నం. 04 2022 ప్రకారం తెలంగాణ ప్రభుత్వం ముదిరాజ్ లకు చేపలు పట్టడానికి వారికి సభ్యత్వాలు కల్పించి మత్స్యకారులుగా గుర్తించాలని అన్నారు.

నృత్యోత్సవ్‌లో విజయ్ విద్యార్థులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ జిల్లా డ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ వారి సౌజన్యంతో బుధవారం రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో 'నృత్యోత్సవ్ - 2023' పేరిట జిల్లాస్థాయి సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. శాస్త్రీయ నృత్య విభాగంలో విజయ్ హైస్కూల్లో 8వ తరగతి చదువుతోన్న జి.శ్రేష్ఠ, వి.సాయి సంజన, టి.భద్రాదేవి, వి.మహతి, 9వ తరగతి చదువుతోన్న పి.అక్షర పాల్గొని ప్రశంసా పత్రాలనూ, జ్ఞాపికను అందుకున్నారు. ఈ సందర్భంగా చిన్నారులను విజయ్ హైస్కూల్ వ్యవస్థాపకులు డాక్టర్ అమృతలత అభినందించారు.

పూజలు చేస్తూ సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన

నవతెలంగాణ-బోధన్

సమగ్ర శిక్ష ఉద్యోగులు తమ నిరసనలో భాగంగా గురువారం సమ్మె శిబిరంలో పొలాల అమవాస్య పండగ సందర్భంగా పూజలు చేసి తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సమ్మె శిబిరానికి పలు ఉపాధ్యాయ సంఘాల నేతలు, బీజేపీ నాయకులు బస్వ లక్ష్మీనరసయ్య సంఘీభావం తెలిపారు. ఈ నిరసనలో జేఏసీ నాయకులు విజయ్, రాజు, బాబు, రేఖ, రాము, రాకేష్, గంగాధర్, సోమలత, నాగరాజు, కవిత తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పొలాల అమవాస్య

నవతెలంగాణ-రెంజల్/బోధన్

మండల కేంద్రంలో పొలాల అమావాస్య వేడుకలను సర్పంచ్ ఎమ్మెస్ రమేష్ కుమార్ ఆధ్వర్యంలో రైతులు ఘనంగా నిర్వహించారు. ఈ పండుగకు రైతులు తమ గోవులను శుభ్రంగా కడిగి, వాటికి వివిధ రకాలుగా అలంకరణలు జరిపారు. మండల పరిషత్ కార్యాలయం నుంచి బసవన్నలు, ట్రాక్టర్లతో ప్రధాన వీధుల గుండా శోభాయాత్ర నిర్వహించి హనుమాన్ మందిరాల చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం వివిధ రకాల పిండి వంటలతో తమ పశువులకు తినిపించి పండుగ వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు ఎల్.కిషోర్, బోడ పోశెట్టి, పగిలేపల్లి అంజయ్య చుక్క రాజుగౌడ్, సగ్గు వెంకటి, ఆర్మూర్ లడ్డు, రంజిత్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

కళతప్పిన బసవన్న పండగ

బోధన్ : రైతులు ఎంతో ఆరాధించే బసవన్నల పండగ ఈ యేడు ఎద్దులు లేక కళతప్పినట్లయింది. దాంతో గ్రామీణ ప్రాంతాలలో రైతులు ఎడ్ల స్థానంలో ట్రాక్టర్లను హనుమాన్ ఆలయం చుట్టు ఊరేగించారు. ఓ గ్రామంలో ట్రాక్టర్‌పై మట్టి బసవన్నల బొమ్మలు చేసి ఊరేగించారు. మరికొన్ని చోట్ల ఎడ్లను ఊరేగించారు.

నేడు అన్నదానం

నవతెలంగాణ-ముప్కాల్

ఎడ్ల పొలాల అమావాస్యను పురస్కరించుకుని శుక్రవారం ఉదయం ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్తులకు మహా అన్నదానం నిర్వహిస్తున్నట్లు కమిటీ అధ్యక్షుడు ఎర్రోళ్ల విజయ్ తెలిపారు. రైతులు పండిస్తున్న పంటలు, వ్యవసాయానికి చేదోడువాదోడుగా ఉంటున్న ఎద్దులు, గేదెలు, ఆవులు సుభిక్షంగా ఉండాలని రైతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నదాన కార్యక్రమం విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు కోరారు.

స్వాతంత్ర్యోద్యమంలో
హిందీ భాషది కీలక పాత్రం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

హిందీ భాష గొప్పదని, స్వతంత్ర పోరాటంలో హిందీ భాషా ముఖ్య భూమిక పోషించిందని చైర్మన్ బోర్డ్ ఆఫ్ స్టడీస్ డిపార్ట్మెంట్ ఆఫ్ ఉర్దూ డాక్టర్ మోహమ్మద్ అబ్దుల్ ఖవి అన్నారు. గురువారం తెలంగాణ యూనివర్సిటీలోని ఆర్ట్స్ కళాశాలలో హిందీ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో హిందీ భాషా దినోత్సవం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా డాక్టర్ అబ్దుల్ ఖవి, చైర్మన్ బోర్డ్ ఆఫ్ స్టడీస్ డిపార్ట్మెంట్ ఆఫ్ ఉర్దూ పాల్గొని మాట్లాడుతూ హిందీ భాష గొప్పదని, స్వతంత్ర పోరాటంలో హిందీ భాషా ముఖ్య భూమిక పోషించిందని పేర్కొన్నారు. హిందీ విభాగ అధ్యక్షుడు డాక్టర్ జమీల్ అహ్మద్ మాట్లాడుతూ.. హిందీ భాషాలోని పాటలను విని అన్ని ప్రాంతాల నిరక్షరాస్యులు అర్థం చేసుకుని ఆనందిస్తారని తెలిపారు. డాక్టర్ పార్వతి, చైర్మన్ బిఓఎస్, పార్ట్ టైం అధ్యాపకులు డాక్టర్ తాహెర్, డాక్టర్ అశోక్ చౌహన్, విద్యార్థులు అనిల్, నవీన్, మనీష్, శ్రావణ్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

లక్ష్యానికి అనుగుణంగా మొక్కలు పెంచాలి

నవతెలంగాణ-బోధన్

ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా నర్సరీలో మొక్కలు పెంచాలని జడ్పీ సీఈఓ గోవింద్ అన్నారు. గురువారం సాలూర మేజర్ గ్రామ పంచాయతీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పంచాయతీ రికార్డులను తనిఖీల్లో గ్రామంలో చేపట్టిన పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నర్సరినీ పరిశీలించి మొక్కల పెంపకం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట ఎంపీడీఓ పర్బన్న, ఎంపీఓ మధుకర్, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్ ఉన్నారు.

అద్భుతం.. ఎస్సారెస్పీ నిర్మాణం

- 60 ఏండ్లు గడిచినా చెక్కు చెదరని ప్రాజెక్టు
- నేడు ఇంజనీర్స్ డే

నవతెలంగాణ-ఆర్మూర్

ఉత్తర తెలంగాణ జిల్లాల కల్పతరువు శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నిర్మాణం ఆనాటి ఇంజనీర్ల నైపుణ్యానికి ప్రత్యేకంగా నిలుస్తోంది. జిల్లాలోని మెండోరా మండలంలోని పోచంపాడు వద్ద శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టు 1963 జూలైలో ప్రారంభమై 1983లో పూర్తయింది. 20 ఏళ్ల ఇంజనీర్ల కృషికి ఫలితం ఈ ప్రాజెక్టు నిర్మాణం. అప్పటి ఇంజనీరింగ్ పనితనం కారణంగానే 60 ఏళ్ల గడుస్తున్నప్పటికీ చెక్కుచెదరకుండా నిలబడింది. ప్రాజెక్టు నుండి మిగులు జలాలను గోదావరిలోకి వదిలేందుకు నిర్మించిన 42 వరద గేట్లు ఎస్సారెస్పీకి ప్రత్యేక ఆకర్షణను తెచ్చిపెట్టాయి. ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 15 నేడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని ఇంజనీర్స్ డే గా జరుపుకుంటారు.

నిర్మాణంలో ప్రత్యేకతలివి..

ఎస్సారెస్పీని 3 ప్రయోజనాలు ఆశించి నిర్మించారు. 18 లక్షల ఎకరాలకు సాగునీరు, 36 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి, చేపల పెంపకం అనే అంశాలపై 112 టీఎంసీల నీటి సామర్థ్యంతో, 1.091 అడుగుల నీటిమట్టంతో, 175 చదరపు మైళ్ళ విస్తీర్ణంతో ప్రాజెక్టును నిర్మించారు. గోదావరి జన్మస్థానానికి 326 మైల్ల దూరంలో సముద్ర మట్టానికి980 అడుగుల ఎత్తులో జాతీయ రహదారి 44పైన ఉన్న సోన్ వంతెన ఎగువ భాగం 3 మైళ్ళ దూరంలో అదిలాబాద్, నిజామాబాద్ సరిహద్దు ప్రాంతంలో నిర్మించారు. వరద నీరు తాకిడిని తట్టుకునే సువిశాలమైన బండరాయిని ఎంచుకొని 140 అడుగుల ఎత్తుతో, 3.143 అడుగుల పొడవు రాతి కట్టడం, 125 అడుగుల ఎత్తుతో..44,750.. అడుగుల మట్టి కట్టడంతో డ్యామ్‌ను నిర్మించారు. 16లక్షల క్యూసెక్కుల వరద నీటిని తట్టుకునేలా ప్రాజెక్టు డ్యాంను ఆనాటి ఇంజనీర్లు డిజైన్ చేసి.. 50 అడుగుల వెడల్పు 33 అడుగుల ఎత్తుతో మొత్తం.. 42 వరద గేట్లను నిర్మించారు. ప్రాజెక్టు నుంచి పూడికపోయేందుకు ఆరు రివర్స్ స్లూయిస్ గేట్లు నిర్మించారు. ఇలా ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేశారు.

దంగుసున్నం, బండరాళ్లతో..

శ్రీరామ్ సాగర్ ప్రాజెక్ట్ నిర్మాణంలో అధికంగా దంగు సున్నం బండారాలను వినియోగించినట్లు ఇంజనీర్లు చెబుతారు. ఎస్సారెస్పీ డ్యాం కాకుండా కుడి ఎడమల 14 కిలోమీటర్ల మేర ఆనకట్ట నిర్మించారు. ఆనకట్టకు రివీట్‌మెంట్ నిర్మాణం కోసం పెద్ద పెద్ద బండరాళ్లను వినియోగించారు. యంత్రాల కంటే కూలీల ఆధ్వర్యంలో అధికంగా పనులు చేపట్టారు.



తెలంగాణ ప్రభుత్వ హయాంలో మరింత అభివృద్ధి



తెలంగాణ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రాజెక్టుల నిర్మాణంలో శ్రద్ధ చూపుతున్నారు. నేడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య స్మారకార్థం ఇంజనీర్స్ డే జరుపుకుంటున్నాం. శాస్త్ర సాంకేతిక రంగాల్లో అత్యాధునిక మార్పులకు అనుగుణంగా విభిన్న రంగాలలో అభివృద్ధి చెందడానికి ఇంజనీర్లే మూలకర్తలు. రైతులు నీటిని వృథా చేయవద్దని, జిల్లాకు చెందిన మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి స్థానిక ఎమ్మెల్యేలు, సంబంధిత అధికారుల నిర్విరామ కృషితో పనులు పూర్తి చేస్తున్నాం.

- ఎం.యశస్వి, నీటిపారుదల శాఖ సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్, ఆర్మూర్.

ఇంజనీర్ల పాత్ర అద్భుతం..



తెలంగాణ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి కేసీఆర్ చేస్తున్న అభివృద్ధిలో ఇంజనీరింగ్ ప్రతిభనే మూలం. ప్రాజెక్టులు, రహదారులు వేయడంలో ఇంజనీర్ల పాత్ర అమోఘం. నేడు ఇంజనీర్స్ డే సందర్భంగా ఇంజనీర్లందరికీ శుభాకాంక్షలు.

- రాజయ్య, పంచాయతీ రాజ్ డిప్యూటీ ఇంజనీర్, ఆర్మూర్.

సమస్యలు పరిష్కరించకపోతే
పోరాటాలను ఉధృతం చేస్తాం

- తాళాలు పగలగొట్టడం హేయమైన చర్య
- అంగన్వాడీ జిల్లా కార్యదర్శి స్వర్ణ

నవతెలంగాణ-కంఠేశ్వర్

అంగన్వాడీ కార్యకర్తల సమస్యలు పరిష్కరించకపోతే పోరాటాలను ఉధృతం చేస్తామని, రాజ్యాంగ బద్ధంగా చేస్తున్న సమ్మెకు వివాదం కలిగిస్తూ తాళాలు పగలగొట్టడం హేయమైన చర్య అని అంగన్వాడీ జిల్లా కార్యదర్శి స్వర్ణ అన్నారు. గురువారం ఐసిడిఎస్ రూరల్ కార్యాలయం ముందు అంగన్వాడీ టీచర్లు, ఆయాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా స్వర్ణ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తమతో వెట్టిచాకిరి చేయిస్తూ సరైన ప్రతిఫలం అందించకుండా 65 సంవత్సరాలు పనిచేయాలని చెప్పడం సిగ్గుచేటని అన్నారు. వీటితోపాటు రిటర్న్ రిటర్మెంట్ బెనిఫిట్స్ కనీసం 10 లక్షల వరకు అయినా అందించాలని, అదేవిధంగా రిటర్మెంట్ అయిన తర్వాత సగం జీతం అందించే విధంగా ఉద్యోగ భద్రత కల్పిస్తూ ప్రభుత్వం అంగన్వాడీ కార్యకర్తల హక్కులను కాపాడే విధంగా ఈ డిమాం డ్లను పరిష్కరించాలని శాంతియుతంగా సమ్మె చేస్తున్నా ఇటువంటి దాష్టికానికి దిగజా రడం సిగ్గుచేటని అన్నారు. రాజ్యాంగం కార్మికులకు కల్పించిన హక్కు సమ్మె అని ఇటువంటి సమ్మెని భంగం పరచడం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం కుట్రలు పన్నుతూ అంగన్వాడీ సెంటర్ల తాళాలు పగలగొట్టి హక్కులను కాలరాస్తున్నారని తెలిపారు. అంగన్వాడీల పోరా టానికి మద్దతుగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బోడ అనిల్, ఐద్వా అధ్యక్ష కార్యదర్శులు అనిత, సుజాత, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు రాములు, కృష్ణ, నర్సన్న అంగన్వాడీలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి స్వర్ణ

విద్యార్థులే ఈ దేశ సంపద

- మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి

నవతెలంగాణ-బాల్కొండ

విద్యార్థులే ఈ దేశ సంపద అని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. మండలంలోని కిసాన్‌నగర్ గ్రామంలో 67వ ఎస్‌జీఎఫ్ ఉమ్మడి బాల్కొండ (బాల్కొండ, మెండోరా, ముప్కాల్ మండలాల) అంతర పాఠశాల క్రీడోత్సవాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు మంత్రికి ఘన స్వాగతం పలికారు. ఆయా పాఠశాలల విద్యార్థులు నిర్వహించిన పరేడ్‌ను తిలకించి, వారి గౌరవ వందనం స్వీకరించారు. విద్యార్థుల సంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా మంత్రి ఉపాధ్యాయులను సన్మానించారు. మంత్రి వేముల మాట్లాడుతూ.. విద్యార్థుల పరేడ్, గౌరవ వందనం ఇక్కడ ఉన్న వారిని మంత్ర ముగ్ధులను చేసిందని అన్నారు. తాను నిజామాబాద్‌లో జెండా పండుగకు పోలీస్ గౌరవ వందనం స్వీకరించిన దాని కంటే ఇవాళ విద్యార్థుల గౌరవ వందనంతో రెట్టింపు సంతోషం కలిగిందన్నారు. ఉమ్మడి బాల్కొండ పాఠశాలల క్రీడాప్రారంభోత్సవ వేడుకకు హాజరు అవ్వడం తాను 10వ తరగతి చదివినప్పటి రోజులు గుర్తు చేస్తున్నాయన్నారు. ఇదే వేదిక మీద తాను సంవత్సరం పాటు(ఇప్పటి లాగ రికార్డెడ్ సాంగ్ ప్లేయింగ్ కాకుండా) ప్రతిజ్ఞ చెప్పానని నాటి జ్ఞాపకాలు నెమరేసుకున్నారు. నాడు విద్యార్థిగా ప్లెడ్జ్ చదివిన ఈ వేదిక మీదనే ఈ ప్రాంత ప్రజా ప్రతినిధిగా, రాష్ట్ర మంత్రిగా ప్రసంగిస్తుండడం ఎంతో సంతోషాన్ని కలిగిస్తోందన్నారు. ఈ విద్యార్థులు భవిష్యత్తులో శాస్త్రవేత్తలు, ప్రముఖులు, ఉన్నతులు అవుతారని వీరే భావి భారత పౌరులని అన్నారు. చంద్రయాన్, నృత్యం, ఇతర కళానైపుణ్యంతో వేడుక కన్నుల పండుగగా ఉందన్నారు. చిన్నారి స్మరాసినీ సొంతగా నేర్చుకొని నాట్యం చేయడం అద్భుతమని కొనియాడారు. క్రీడల్లో ఆడే వారు స్పోర్ట్స్ స్పిరిట్‌తో ఉంటారని అంటే గెలుపు, ఓటమికి పొంగిపోవడం, కుంగి పోవడం ఉండవన్నారు. ఇదే స్ఫూర్తిని జీవితంలో కొనసాగించాలని సూచించారు. విద్యార్థులకు ఇంత చక్కటి ట్రైనింగ్ ఇచ్చిన పి.ఈ.టిలకు, ఉపాధ్యాయులకు, పాఠశాలల యాజమాన్యానికి మంత్రి హృదయ పూర్వక శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేశారు. క్రీడల్లో పాల్గొనే విద్యార్థులకు మంత్రి ఆల్ ది బెస్ట్ చెప్పారు. విద్యార్థిని, విద్యార్థులకు తన ఆశీస్సులు ఎప్పుడూ ఉంటాయని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్‌జీఎఫ్ అధ్యక్షుడు సంగీతరావు, కిసాన్‌నగర్ సర్పంచ్ మానేటి తులసి, ఎంఈఓ బట్టు రాజేశ్వర్, క్రీడా ఉత్సవాల కన్వీనర్ ఎం.సాయన్న, బాల్కొండ జడ్పిటిసి దాసరి లావణ్య వెంకటేష్, బాల్కొండ ఎంపీపీ లావణ్య లింగాగౌడ్, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బద్దం ప్రవీణ్ రెడ్డి, ఎంపీటీసీ రామరాజు గౌడ్, ఉపాధ్యాయ సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మంత్రి

కేసీఆర్‌కు ప్రజలు త్వరలోనే బుద్ధి చెప్తారు

నవతెలంగాణ-విలేకరుల బృందం

నిజామాబాద్ సిటీ : సీఎం కేసీఆర్‌కు ప్రజలు త్వరలోనే బుద్ధి చెప్తారని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ అన్నారు. గురువారం నగరంలోని నిఖిల్‌సాయి చౌరస్తాలో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి అక్రమ అరెస్టుకు నిరసనగా పెద్ద ఎత్తున రాస్తారోకో చేశారు. జిల్లా ప్రధాన కార్యదర్శి పోతనకర్ లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షులు నాగొల్ల లక్ష్మీనారాయణ, అధికార ప్రతినిధి స్వామి యాదవ్, కో కన్వీనర్ నారాయణ యాదవ్, మండల అధ్యక్షులు కృష్ణుడు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి : బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రాకముందు నిరుద్యోగులకు ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి అందజేస్తామని చెప్పిన హామీ ఏమైందని ఇందల్‌వాయి బిజెపి మండల అధ్యక్షులు నాయిడి రాజన్న అన్నారు. మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద బిజెపి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు.

బోధన్ : బీజేపీ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి అరెస్టును నిరసిస్తూ సాలూర మండల కేంద్రంలోని అంతరాష్ట్ర రహదారిపై బీజేపీ నాయకులు సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సంధర్బంగ మండల అధ్యక్షులు ప్రవీణ్ మాట్లాడారు.

రెంజల్ : బిజెపి అధ్యక్షులు కిషన్ రెడ్డి అక్రమ అరెస్టుకు నిరసనగా సాటాపూర్ చౌరస్తాలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డీ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి, సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ శ్రీధర్, బిజెపి మండల అధ్యక్షులు గోపికృష్ణ, మండల అధ్యక్షులు ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి : కిషన్ రెడ్డి అక్రమ అరెస్టును నిరసిస్తూ రాష్ట్ర ప్రభుత్వం దిష్టిబొమ్మ దహనం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు వేంపల్లి శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి : బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి దీక్ష చేస్తున్న సందర్భంగా అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు.

నవీపేట్ : కిషన్ రెడ్డి అక్రమ అరెస్టుకు నిరసనగా మండల కేంద్రంలో బిజెపి ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు.

ఆర్మూర్ : బిజెపి పట్టణ అధ్యక్షులు ద్యాగ ఉదయ్ ఆధ్వర్యంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి అరెస్టుకు నిరసనగా కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు.

మాక్లూర్ : బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి కెసిఆర్, రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి గంగోని సంతోష్, పార్టీ మండల అధ్యక్షులు రామావత్ సురేష్ నాయక్ కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరంతర విద్యుత్ సరఫరా
దేశానికే ఆదర్శం

- టీఎస్ జెన్‌కో అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీలత

నవతెలంగాణ-బాల్కొండ



"24/7 విద్యుత్ సరఫరాలో నేను కూడా భాగం అయినందుకు చాలా గర్వంగా ఉంది. తెలంగాణ రాక ముందు తెలంగాణ ఇంజనీరులకు పవర్ జనరేషన్ చేసే సత్తా లేదనీ ఇతర రాష్ట్రాలు హేళన చేశాయి. అదే మన తెలంగాణ రాష్ట్రం సాధించిన తర్వాత మన ఇంజనీర్స్ దాన్ని ఛాలెంజ్‌గా తీసుకొని మనం నిరంతరంగా విద్యుత్ సరఫరా చేస్తూ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నందుకు చాలా గర్వంగా ఉంది. నా ఉద్యోగ బాధ్యతను నేను చిత్తశుద్ధితో నిర్వహిస్తూ తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిలో తద్వారా దేశ అభివృద్ధిలో నా వంతు బాధ్యతను నిర్వహిస్తున్నాను." అని టీఎస్ జెన్‌కో అసిస్టెంట్ ఇంజనీర్ శ్రీలత తెలిపారు. నేడు ఇంజనీర్స్ డేను పురస్కరించుకుని ఆమె నవతెలంగాణకు ఇంటర్వ్యూనిచ్చారు.

నవతెలంగాణ : కుటుంబ నేపథ్యం గురించి వివరించండి ?

అసిస్టెంట్ ఇంజనీర్ : మా తండ్రి పేరు ఈర్ల చిన్న రాజన్న, తల్లి రాజవ్వ మా గ్రామం మెండోరా. భర్త దీపక్‌ది బాల్కొండ.

మీ విద్యాభ్యాసం ?

ఒకటో తరగతి నుండి నాలుగో తరగతి వరకు మెండోరా ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నాను. అనంతరం ఐదవ తరగతి నుండి పదవ తరగతి వరకు ఏపీఆర్ఎస్ బాలికల పాఠశాల బోధన్‌లో చదివాను. పదవ తరగతిలో మెరిట్ ఫలితం రావడంతో ట్రిబుల్ ఐటీ బాసరలో సీటు సాధించాను. అక్కడే ఇంజనీరింగ్ వరకు చదివాను.

మీ ఇంజనీరింగ్ ఉద్యోగ ప్రస్థానం ?

2015లో టిఎస్పిఎస్సి నిర్వహించిన ఏఈఈ, ఏఈ, అలాగే టీఎస్ జెన్కో నిర్వహించిన డైరెక్ట్ రిక్రూట్మెంట్‌లో అసిస్టెంట్ ఇంజనీర్ ఉద్యోగంలో పరీక్ష రాసి ఉత్తీర్ణత సాధించాను. ఇంజనీరింగ్ విభాగంలో మూడు ఉద్యోగాలకై పరీక్షలు రాసి మూడింటిలో ఉత్తీర్ణత సాధించాను. అనంతరం టీఎస్ జెన్కోలో అసిస్టెంట్ ఇంజనీర్‌గా 2016లో బాధ్యతలు స్వీకరించాను.

ఇంజనీర్స్ డే ప్రాముఖ్యత గురించి మీ మాటల్లో ?

మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సెప్టెంబర్ 15న భారత ప్రభుత్వం 1968లో ఇంజనీర్స్ డే గా ప్రకటించింది. మోక్షగుండం విశ్వేశ్వరయ్య సివిల్ విభాగంలో చేసిన విశేష కృషికిగాను ఆయన జయంతిని మనం ఇంజనీర్స్ డేగా నిర్వహించుకుంటున్నాం. నేను కూడా సివిల్ విభాగంలో విద్యానభ్యసించి ఉద్యోగం నిర్వహిస్తున్నందుకు చాలా గర్వంగా ఉంది.


జిల్లా కలెక్టర్‌ను కలిసిన పోలీస్ కమిషనర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ కలెక్టర్ కార్యాలయంలోని చాంబర్ ఎదుట నిజామాబాద్ జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతును సీపీ వి.సత్యనారాయణ, గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేశారు.

ఆంధ్రనాగర్ పంచాయతీకి అవార్డు

నవతెలంగాణ-నందిపేట్



2023వ సంవత్సరపు రాష్ట్రస్థాయి స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ అవార్డును నిజామాబాద్ జిల్లా నందిపేట్ మండలం ఆంధ్రనగర్ గ్రామపంచాయతీకి దక్కింది. రాష్ట్ర రాజధాని హైదరాబాదులో జరిగిన అవార్డు కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు చేతుల మీదుగా సర్పంచ్ నాయుడు రామారావు అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ నాయుడు రామారావు మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయి అవార్డును అందుకున్నందుకు ఎంతో ఆనందంగా ఉందని, గ్రామపంచాయతీ సిబ్బంది, ఎంపీడీవో సిబ్బంది, డిపిఓ సహకారంతోనే గ్రామాన్ని అందంగా తీర్చిదిద్దుకున్నామని, గ్రామస్తుల సహకారం కూడా చాలా విలువైందని, శుభ్రత కార్యక్రమానికి ప్రతి ఒక్కరు సహకరించారని అందరి కృషితోనే ఈ అవార్డు సొంతమైందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, పంచాయతీరాజ్ డైరెక్టర్ హనుమంతరావు, సీఈఓ సెర్ప్ గౌతమ్, ఎఫ్‌బీఎం డైరెక్టర్ సురేష్ బాబు, జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారి చందర్ నాయక్, డిపిఓ జయసుధ, ఎంపిడిఓ నాగవర్ధన్, ఎంపీఓ కిరణ్, పంచాయతీ సెక్రెటరీ ఐనార్ల సందీప్, ఎస్బిఎం జిల్లా కో ఆర్డినేటర్స్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కామారెడ్డి
శుక్రవారం | సెప్టెంబర్ 15, 2023 | www.navatelangana.com

చిరుత సంచారం

నవతెలంగాణ-మాచారెడ్డి

మాచారెడ్డి మండలంలోని అక్కాపూర్ శివారులో చిరుత సంచరిస్తుందని గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. గురువారం పొలాల వద్ద లేగ దూడను చిరుతపులి ఎత్తుకెళ్లింది. పంట పొలాల్లో చిరుత పాదముద్రలను గుర్తించిన స్థానికులు పోలీసులు అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. ఘటన స్థలాన్ని పరిశీలించిన అటవీ సిబ్బంది అవి చిరుత పులి పాదముద్రలేనని నిర్ధారించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఒంటరిగా వెళ్లొద్దని సూచించారు.



జాలి ఏర్పాటు చేస్తున్న అటవీశాఖ అధికారులు

శివాయిపల్లికి స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ అవార్డు

నవతెలంగాణ-రాజంపేట్

గ్రామీణ స్వచ్ఛ సర్వేక్షన్-2023 కార్యక్రమంలో భాగంగా కామారెడ్డి జిల్లా రాజంపేట్ మండలం శివాయిపల్లి గ్రామం స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ అవార్డు అందుకుంది. గురువారం హైదరాబాదులో మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, ప్రిన్సిపాల్ సెక్రటరీ కమిషనర్ పంచాయతీరాజ్ చేతుల మీదుగా సర్పంచ్ విట్టల్ రెడ్డి, పంచాయతీ సెక్రటరీ అరుణ్ అవార్డును తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ సాయన్న, డిపిఓ శ్రీనివాసరావు, ఎంపీడీవో బాలకిషన్, ఎంపీ ఓ, ఎస్‌బిఎం నారాయణ తదితరులు పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న సర్పంచ్, జీపీ కార్యదర్శి

ఉద్యోగ భద్రత కల్పించాలి

- సమ్మెలో భాగంగా ఐసీడీఎస్ ఆఫీస్‌ను ముట్టడించిన అంగన్‌వాడీలు

నవతెలంగాణ-నసురుల్లాబాద్/దోమకొండ

తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నిరవధిక సమ్మెలో ఒక భాగంగా గురువారం బాన్సువాడ పట్టణంలోని ఐసిడిఎస్ కార్యాలయాన్ని అంగన్‌వాడీలు సీఐటీయూ ఆధ్వర్యంలో ముట్టడించారు. ఉదయం అంగన్వాడీ ఉద్యోగులు అంబేద్కర్ చౌరస్తా నుండి ఐసిడిఎస్ కార్యాలయం వరకు ర్యాలీగా వచ్చి ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేంత వరకు నిరవధిక కొనసాగుతుందన్నారు.

బాన్సువాడ పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట సీఐటీయూ జిల్లా నాయకుడు ఖలీల్ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం చేపట్టారు. టీచర్లు మాట్లాడుతూ తమకు జీతాలు రావడంలేదని అంగన్‌వాడి వర్కర్లు, హెల్పర్లు నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు కలిల్ అంగన్వాడీ టీచర్లకు రూ.10 లక్షలు, మినీ టీచర్లకు రూ. 5 లక్షల బెనిఫిట్స్ అందజేయాలన్నారు. అంగన్వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేసి నెలకు రూ. 26 వేలు కనీస వేతనం అందజేయాలని డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 14, 19, 8 లను వెంటనే సవరించాలన్నారు. కనీస వేతనాలు 26 వేలు, ఉద్యోగ భద్రత కల్పించాలని, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని ఇన్సూరెన్స్ సౌకర్యాలు 10 లక్షలు టీచర్‌కు ఆయాకు ఐదు లక్షలు అదే విధంగా టీచర్ రిటర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నసురుల్లాబాద్, బీర్కూర్, బాన్సువాడ మండలాల అంగన్ వాడి టీచర్లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





బాన్సువాడలో ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట బైటాయించి నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు... దోమకొండలో..

ఐసీడీఎస్ ప్రాజెక్టు ఎదుట

దోమకొండ : దోమకొండ మండల కేంద్రం లోని ఐసీడీ యస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ ఆధ్వర్యంలో గురువారం ధర్నాను నిర్వహించి కార్యాలయం ముట్టడించడంతో ఘటన స్థలానికి ఎస్ఐ మురళి, సిబ్బంది చేరుకొని వారిని సముదాయించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్స్ అధ్యక్షురాలు యాదమ్మ మాట్లాడుతూ అంగన్వాడీ టీచర్ లను ప్రభుత్వం వెంటనే పర్మినెంట్ చేయాలని కోరారు.

భాష పండితులకు సన్మానం

నవతెలంగాణ-జుక్కల్

జుక్కల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం తెలుగు బాషా పండితులకు సన్మానించినట్టు ప్రాదాన ఉపాద్యాయుడు బస్వంత్ పటేల్ తెలిపారు. అదే విధంగా విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలను నిర్వహించినట్టు తెలిపారు. తెలుగు బాషా పాండిత్యంలో పి హెచ్‌డి డాక్టరేట్ పట్టా పొందిన భాస్కర్‌రావ్‌కు ఉపాద్యాయ బృందం సన్మానించినట్టు తెలిపారు. పాఠశాలలోని విద్యార్థిని కూమారి వర్ష శ్రద్ధ, వంద పద్యాలు, త్రిష, కావేరి, నందిని, సురేఖ, కీర్తన, భవానీ, అవంతిక, సంగీత యాభై పద్యాలు పాడారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం, తెలుగు బాషా పండితుడు బాస్కర్ రావ్, పాఠశాల ఉపాద్యాయబృందం తదితరులు పాల్గొన్నారు.



సన్మానిస్తున్న హెచ్ఎం

మయబ్రహ్మ సంఘం కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-తాడ్వాయి

కృష్ణాజి వాడిలో మయబ్రహ్మ సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా వడ్ల కృష్ణ మూర్తిచారి, ఉపాధ్యక్షులు వడ్ల నర్సింలుచారి, సెక్రటరి వడ్ల రంజిత్ చారి, క్యాషియర్ వడ్ల కిషోర్ చారి , సెక్రటరీ వడ్ల బాలచంద్రం చారి , సలహాదారులు వడ్ల పెద్ద శంకర్ చారి , వడ్ల విశ్వనాథం చారి, వడ్ల అరుణ్ చారి , వడ్ల నడిపి రాజు చారిని ఎన్నుకున్నారు. అధ్యక్షులు కృష్ణమూర్తి చారి మాట్లాడుతూ సంఘం అభివృద్ధికి తాను ఎల్లవేళలా కృషి చేస్తా అన్నారు.

బీఆర్ఎస్ అధికార ప్రతినిధికి సన్మానం

నవతెలంగాణ-లింగంపేట్

కామారెడ్డి జిల్లా కేంద్రంలో సెన్సార్ బోర్డు మెంబర్ రామకృష్ణ గుప్తాను గురువారం సహచర తెలంగాణ ఉద్యమకారుడు బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాజారాం యాదవ్ తన కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం మొదటి సారిగా తన కార్యాలయానికి విచ్చేసిన శుభసందర్భంగా సెన్సార్ బోర్డు మెంబర్ రామకృష్ణ గుప్తా సహచర తెలంగాణ ఉద్యమకారు అయిన రాజారాం యాదవ్‌ను శాలువగప్పి ఘనంగా సన్మానించారు. ఉద్యమంలో పాల్గొన్న సందర్భంగా గుర్తు చేసుకున్నారు. రానున్న ఎన్నికల్లో అధికార పార్టీ గెలుపు కోసం ఉద్యమకారులు కష్టపడి పనిచేయాలని బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయం ఆశ భావం వ్యక్తం చేశారు.



సింహ గర్జనకు తరలిరావాలి

- వాల్‌పోస్టర్‌లు ఆవిష్కరించిన మున్నూరుకాపు నాయకులు



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

నవతెలంగాణ-మద్నూర్

మున్నూరు కాపుల డిమాండ్ల సాధనకు ఐకమత్యంగా పోరాడు దామని పిలుపునిస్తూ ఈనెల 21న గురువారం బిచ్కుంద మండల కేంద్రంలో నిర్వహించే మున్నూరు కాపు సింహ గర్జన కార్యక్రమానికి భారీ ఎత్తున తరలి రావాలని మున్నూరుకాపు నాయకులు పిలుపునిచ్చారు. మద్నూర్ మండల కేంద్రంలోని మున్నూరు కాపు సంఘం భవనంలో జుక్కల్ నియోజకవర్గంలోని వివిధ మండలాల నుండి ముఖ్య నాయకులు హాజరయ్యారు. బిచ్కుందలో నిర్వహించే మున్నూరు కాపు సింహ గర్జన పోస్టర్లు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జుక్కల్ నియోజకవర్గంలోని మండలాల నుండి సింహం గర్జనకు మున్నూరు కాపులంతా పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సంవత్సరానికి 5000 కోట్లతో మున్నూరు కాపు ఫైనాన్స్ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, మున్నూరు కాపు విద్యార్థి వసతి గృహాన్ని ఎండోమెంట్ బోర్డు నుండి తొలగించి మున్నూరు కాపులకు అప్పగించాలని, మున్నూరు కాపు ప్రతి కుటుంబానికి కుల వృత్తుల సహాయం కింద ఐదు లక్షల రూపాయలు కేటాయించాలని, ఈడబ్ల్యూఎస్ ప్రకారంగా మున్నూరు కాపులకు ప్రత్యేకంగా 10 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. తదితర డిమాండ్‌ల సాధనకు పోరాటాలకు సిద్ధం కావాలని కోరారు. కార్యక్రమంలో మద్నూర్ మండల మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు ఎస్ గంగారం, గ్రామ అధ్యక్షులు డాక్టర్ బండి వార్ విజయ్, ప్రధాన కార్యదర్శి ఎస్ హనుమాన్లు, ఉపాధ్యక్షులు కర్ల సాయిలు అనుమువార్, హనుమాన్లు, కోశాధికారి చందర్ నియోజకవర్గంలోని ఆయా మండలాల ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి జిల్లాకు మంచి రోజులు

- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

నవతెలంగాణ-కామారెడ్డి(తాడ్వాయి)

కామారెడ్డి జిల్లాకు మంచి రోజులొచ్చాయని, రాబోయే 3, 4 సంవత్సరాలలో ఊహించని విధంగా జిల్లా సమగ్రాభివృద్ధితో దూసుకుపోతోందని రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్య, పాడి అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖామాత్యులు తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆశాభావం వ్యక్తం చేశారు. గురువారం నిజామాబాద్ పర్యటనకు వెళ్తూ మార్గమధ్యంలో ఓ హెూటల్ లో (హల్ట్) బస చేసిన మంత్రిని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, జిల్లా పశు సంవర్ధక అధికారి సింహ రావు, మత్స్య శాఖాధికారి వరదా రెడ్డి, ఆర్.డి.ఓ. శ్రీనివాస్ రెడ్డి, పాడి అభివృద్ధి మేనేజర్ శ్రీనివాస్, దేవేందర్, ప్రజాప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకేలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పత్రికా విలేకరుల సమావేశంలో మంత్రి తలసాని మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన తొమ్మిదిన్నర సంవత్సరాలలో రాష్ట్రం అన్ని రంగాలలో అద్భుత ప్రగతి సాధించిందని అన్నారు. మానిఫెస్టోలో లేకున్నా పేద ప్రజల సంక్షేమమే పరమావధిగా రాష్ట్ర ముఖ్యమంత్రి పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రామాలు అమలు చేస్తూ పలు అవార్డులు, రివార్డులతో దేశం రాష్ట్రం వైపు చూసేలా చేశారని అన్నారు. జిల్లాలో పట్టణ అభివృద్ధి పథకం కింద 100 కోట్లతో పలు కార్యక్రామాలు చేపట్టామని, అదేవిధంగా పల్లె ప్రాతి క్రింద ప్రతి గ్రామానికి ట్రాక్టర్,ట్రాలీ అందించామని, వైకుంఠధామాలు, పల్లెప్రకృతి వనాలు, నర్సరీలు ఏర్పాటు చేశామని, తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చామని, నేడు భూముల విలువ ఎంతో పెరిగిందని అన్నారు. 8 కోట్లతో ఇండోర్ స్టేడియం అభివృద్ధి చేయనున్నామన్నారు. ఇన్ని సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నా ప్రతిపక్షాలు సానుకూల దృక్పథంతో చూడడం లేదని ఎద్దేవ చేశారు. 50 ఏండ్లు పాలించిన కాంగ్రెస్ ఏమి చేయకున్నా, మరొక్కసారి ఛాన్స్ ఇవ్వమని అడగడం విడ్డురంగా ఉందన్నారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి కామారెడ్డి నియోజక వర్గం నుండి పోటీ బీచేయనుండడం ఇక్కడి ప్రజలు చేసుకున్న అదృష్టమని, గజ్వేల్ తరహాలో భవిష్యత్తులో ఇక్కడ యుద్ధప్రాతిపదికన పనులు జరుగుతాయని, అద్భుత ప్రగతి జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



మంత్రికి స్వాగతం పలుకుతున్న సర్పంచ్

మంత్రిని కలిసి సర్పంచ్

గాంధారి : కామారెడ్డి జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను గాంధారి మండల సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు గాంధారి సర్పంచ్ మమ్మాయి సంజువ్ యాదవ్ మర్యాద పూర్వకంగా కలిశారు. గాంధారి గ్రామానికి వివిధ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని మంత్రిని సర్పంచ్ కోరారు.

బీఆర్ఎస్ హయాంలోనే అభివృద్ధి

తలమడ్ల సర్పంచ్ వ్యాఖ్యలను ఖండించిన ఎంపీటీసీ

నవతెలంగాణ-రాజంపేట్

తలమడ్ల గ్రామానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి నిధులు మంజూరు కాలేదని గ్రామం ఎలాంటి అభివద్ధి జరగలేదని సర్పంచి యాదవ రెడ్డి పేర్కొనడాన్ని ఎంపీటీసీ రాజు ఖండించారు. గురువారం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. కామారెడ్డి ఎమ్మెల్యే గంప గోవర్ధన్ సహకారంతోనే గ్రామంలో సీసీ రోడ్లు 54 లక్షలతో వేశామని, పార్కు రెండు లక్షల 40 వేలు, క్రీడా ప్రాంగణానికి రెండు లక్షలు , జిపి ట్యాంకర్ ట్రాక్టర్ కు 12 లక్షలు, 74 లక్షలతో హై స్కూల్ నిర్మాణం, ప్రైమరీ హెల్త్ సెంటర్ కు 20 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. ప్రస్తుతం టెండర్ విధానం నడుస్తుందని ఆయన తెలిపారు. పాఠశాల సైన్స్ ల్యాబ్ కు తొమ్మిది లక్షలు ఈ విధంగా గ్రామానికి ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టినట్టు తెలిపారు.

నీటిఎద్దడి పరిష్కరించేందుకు బోరు ఏర్పాటు

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని నాగల్‌గావ్ గ్రామ ఎస్సీ వార్డులో గత కొన్ని రోజులుగా బోరు మోటార్ లేక నీటి సమస్యతో స్థానికులు ఇబ్బందులు పడుతుండటంతో సర్పంచ్ కపిల్ పటేల్ , కార్యదర్శి హరిష్ గురువారం బోర్ వేయించి సింగిల్ ఫేజ్ మోటార్ బిగించినట్టు తెలిపారు. బోరువేసి, సింగిల్ ఫేజ్ బోరు మోటార్ ఏర్పాటుచేసి సమస్యను పరిష్కరించినందుకు కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేవారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు యాదవ్, గ్రామస్తులు అనిరుద్, గంగాధర్, కృష్ణ, కాలనీ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

నేడే టెట్.. ఏర్పాట్లు పూర్తి

నవతెలంగాణ-కామారెడ్డి(తాడ్వాయి)

నేడు రెండు సెషన్స్‌లో జరగనున్న టీచర్స్ ఎలిజిబుల్ టెస్ట్(టెట్) కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు రెవిన్యూ అదనపు కలెక్టర్ చంద్ర మోహన్ తెలిపారు. గురువారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో టెట్ పరీక్ష నిర్వహణ కోసం నియమించిన 360 మంది చీఫ్ సూపెరింటెండెంట్లు, డిపార్ట్మెంటల్ అధికారులు, హాల్ సూపెరింటెండెంట్లు, ఇన్విజిలేటర్లకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతూ అధికారులు తమకు కేటాయించిన విధులను బాధ్యతతో నిర్వహించాలని సూచించారు. ఎలాంటి పొరపాట్లకు, అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ఒక యజ్ఞంలా భావించి అందరు సమన్వయంతో నిబద్ధతగా పనిచేయాలని కోరారు. శుక్రవారం ఉదయం 9. 30 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించే మొదటి పేపర్ లో 5,535 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారని, ఇందుకోసం జిల్లా కేంద్రంలో 24 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. అదేవిధంగా మధ్యాహ్నం 2. 30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు జరిగే రెండవ పేపర్ కు 4,205 మంది అభ్యర్థులు పరీక్ష వ్రాయనున్నారని ఇందుకోసం 19 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

ఫోటోగ్రాఫర్స్ నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ మండల ఫోటోగ్రాఫర్స్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులు ఉప్పరి లింబాద్రి, ఉపాధ్యక్షులు అసం సిద్ధరాములు, కార్యదర్శి శ్రావణ్, జనార్ధన్, కోశాధికారి సమీర్, రాజ్ కుమార్, పీఆర్వో రాజేందర్, బాబు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన అధ్యక్షులు ఉప్పరి లింబాద్రి సీనియర్ ఫోటోగ్రాఫర్ కుర్రి లింబాద్రిని సంఘం ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల ఫోటోగ్రాఫర్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

మదన్‌మోహన్‌రావుకు సన్మానం

నవతెలంగాణ-గాంధారి

టీపీసీసీ కమ్యూనికేషన్స్ కమిటీ వైస్ చైర్మన్‌గా కామారెడ్డి జిల్లాకు చెందిన మదన్ మోహన్‌రావు నియమితుల య్యారు. ఈ సందర్భంగా గాంధారి మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఉమ్మాజీ భాస్కర్‌రావు ఆయనను కలిసి శాలువతో సన్మానించి అభినందలు తెలిపారు.



పాఠశాలకు గ్రీన్ బోర్డు సౌండ్ వితరణ

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట మండలంలోని ప్రాథమికోన్నత పాఠశాల సజ్జన్ పల్లికి.. గ్రామనివాసి అయిన రాజేశ్వర్‌గౌడ్ 3000 రూపాయలు విలువ గల గ్రీన్ బోర్డ్, స్టాండ్ బాక్స్ అందజేసినట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయులు దామోదర్ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది అతనిని అభినందించారు. 2022-2023 విద్యా సంవత్సరంలో ఇదే పాఠశాలలో విద్యనభ్యసించిన 8వ తరగతి విద్యార్థులు కూడా ఒక గ్రీన్ బోర్డు అందించినట్టు తెలిపారు. హిందీ భాషా దినోత్సవం పురస్కరించుకొని హిందీ బోధించే ఉపాధ్యాయులు జాకీర్‌ను శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పద్మ, జాకిర్, కవిత విద్యార్థులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లోకి పలువురి చేరిక

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

పెద్ద కొడపగల్ మండలంలోని చిన్న తక్కడ పల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు మైత్రి సంజీవ్ తక్కడ పల్లి నాయకుల ఆధ్వర్యంలో గురువారం ఎంపీపీ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేవారు. గత ఎంపిటిసి ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ నుండి పోటీ చేసి ఒడిపోయారని, ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్టంలో చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై పార్టీలో చేరినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి, సర్పంచ్ లక్ష్మి అశోక్ పటేల్, నర్సుపాటేల్, ప్రశాంత్, బాబు పటేల్, రాజు పటేల్, సాయిరాం, మల్లేష్, వెంకట్, తదితరులు పాల్గొన్నారు.



కండువా కప్పుతున్న ఎంపీపీ

ఘనంగా ఎడ్ల పొలాల అమావాస్య

నవతెలంగాణ-జుక్కల్

అన్నదాతకు సాగులో తోడుండే మూగజీవాలను కొలిచే పొలాల అమావాస్యను జిల్లా వ్యాప్తంగా రైతులు ఘనంగా నిర్వహించుకున్నారు. జుక్కల్ మండలంలో గురువారం రైతులు ఎడ్ల పొలాల అమావాస్య పండుగను ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండి రైతులు తమ ఎడ్లకు స్నానాలు చేయించి రంగులు వేసి ముస్తాబు చేశారు. సాయంకాలం వేళ ఆంజనేయస్వామి ఆలయాలని వద్ద బాజాభజంత్రీల సప్పుడు నడుమ ఆలయం చుట్టూ ఎడ్లతో ప్రదక్షణలు చేయించి, వరుడికి చేసినట్టు అలంకరణ చేసి ఆవుతో మంత్రఉచ్చరణలతో వివాహమహొత్సవం నిర్వహించి, అథితిలకు పిండి వంటకాలతో సహపంక్తి భోజనాలు చేశారు.



పెద్దకొడప్‌గల్‌లో..

సదాశివనగర్ : మండలంలోని పలు గ్రామాల్లో గురువారం ఎడ్ల పొలాల అమావాస్యను ఘనంగా నిర్వహించుకున్నారు. ఎడ్లను ముస్తాబు చేసి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు.

పిట్లం : మండలంలోని ఆయా గ్రామాలలో గురువారం పొలాల అమావాస్యను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు తమ బసవన్నలను , ఆవులను ఉదయమే గ్రామ పొలిమేరలోని వాగులు, కుంటలలో వాటికి స్నానమాచరింపజేసి , బెల్లం పానకము తాగించి , ఒంటిపై తిరొక్క రంగులు అద్దిన అనంతరం అడవికి మేత కోసం తీసుకెళ్లి తిరిగి సాయంత్రం వేళలో ఆయా గ్రామాల హనుమాన్ మందిర్ చుట్టూ బసవన్నలతో ప్రదక్షణలు చేయించారు. రాత్రి వేళల్లో బసవన్నలను భక్తిశ్రద్ధలతో కుటుంబ సమేతంగా పూజించి బెల్లం పప్పు పోలెలను నైవేద్యముగా సమర్పించారు.

పెద్దకొడప్‌గల్ : పెద్దకొడప్‌గల్ మండలంలోని వివిధ గ్రామాలలో ఎడ్లకు పూల దండలు, గజ్జెలు, కొత్త కన్నాలతో ముస్తాబు చేసిన బసవన్నలకు ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలను సమర్పించారు. హనుమాన్ దేవాలయాల్లో ఎడ్లతో ప్రదక్షిణలు చేయించి మొక్కులుచెల్లించుకున్నారు.

గురుకుల పాఠశాలలో ఆకస్మిక తనిఖీ

నవతెలంగాణ-నసురుల్లాబాద్

విద్యార్థుల సంక్షేమం లక్ష్యంగా, సిఎం కేసిఆర్ మానసపుత్రికలైన గురుకులల్లో నాణ్యమైన విద్యతో పాటు నాణ్యమైన భోజనం అందించాలని నసురుల్లాబాద్ ఎంపిపి పాల్త్య విఠల్ సూచించారు. గురువారం నసురుల్లాబాదు మండల కేంద్రంలోని గిరిజన బాలుర గురుకుల పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలోని రికార్డులను పాఠశాల గదులను వంటశాల ఆయన పరిశీలించారు. వంట సామగ్రి, కూరగాయల బియ్యంలను పరిశీలించారు. రాత్రి కరెంటు పోతే గురుకుల పాఠశాల అందాకారంలో ఉంటుందని కరెంటు వచ్చేవరకు ఏలాంటి సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థులంతా భయంతో ఉంటున్నామని ఎంపీపీ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట వైస్ ఎంపీపీ ప్రభాకర్ రెడ్డి, ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, ఎంపీఓ రాము, ఆర్ ఐ హన్మండ్లు, తహశీల్దార్ రాజు, మాజీ ఎంపిటిసి ఫోరం కన్వీనర్ కంది మల్లేష్, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

ఇంటికో ఉద్యోగం ఇవ్వాలి

బీజేపీ ఆధ్వర్యంలో నిరసన

నవతెలంగాణ-లింగంపేట్/తాడ్వాయి

ఇంటికో ఉద్యోగం ఇవ్వాలని, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇవ్వాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి అరెస్టుకు నిరసనగా.. లింగంపేట్ మండల కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద గురువారం నిరసన చేపట్టారు. ఉపవాస దీక్ష చేస్తుంటే పోలీసులు కేంద్ర మంత్రి అని చూడకుండా గాయపరిచి అక్రమ అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నామని అన్నారు. అనంతరం అంగన్‌వాడీల సమ్మెకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాపిరెడ్డి మండల అధ్యక్షులు జక్సాని దత్తు రాములు, అసెంబ్లీ కన్వీనర్ లింగారావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం

తాడ్వాయి : మండల కేంద్రంలోని పాత బస్టాండ్ ఎదుట సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను బీజేపీ నాయకులు దహనం చేశారు. గత ఎన్నికల ముందు నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని, నిరుద్యోగ భృతి అందిస్తామని హామీ ఇచ్చిన కేసీఆర్ ప్రస్తుతం ఆ హామీలను తుంగలో తొక్కారని మండిపడ్డారు. రాష్టంలో కెసిఆర్ కు తగిన గుణపాఠం తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు వెంకట్రావు, నాయకులు బాపురెడ్డి, గంగారెడ్డి, లింగారావు, రవీందర్ రావు, ,హెూటల్ శ్రీను, సంతోష్ రెడ్డి, రవీందర్ రెడ్డి పాల్గొన్నారు.

మోడెగాంలో ఆయుర్వేదిక మెడికల్ క్యాంపు

నవతెలంగాణ-సదాశివనగర్

మండలం లోని మోడేగాం గ్రామంలో గురువారం ఆయుర్వేదిక మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయుర్వేద మెడికల్ డాక్టర్ సహేధ ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పండ్లు అందించారు. అనంతరం ఉపసర్పంచ్ కు రాజుకు గ్రామ ప్రజలకు కరదీపికను అందించారు. ఆరోగ్య పరీక్షలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మచ్చర్ల రాజు. జీపీ కార్యదర్శి ప్రవీన్ ,ఎస్ యన్ ఓ పద్మావతి. నాయకులు ఆశిరెడ్డి ఆశ కార్యకర్తలు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు అందజేత

సోయాకు కాండపు ఈగ

- పత్తికి రసం పీల్చే పురుగుల బెడద

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్ మండలంలోని పెద్ద తడగూర్ గ్రామ శివారులో సోయా పంటకు కాండపు ఈగ అధికం కావడం పత్తి పంటకు రసం పీల్చే పురుగుల బెడద అధికంగా ఉన్నట్లు క్లస్టర్ పరిధిలోని ఏఈఓ సతీష్ తెలిపారు. గురువారం పంటలను నివారణ సూచనలు అందజేశారు. అధికారుల సలహాలు సూచనలు పాటిస్తే పంటలకు సోకిన పురుగులను నివారించుకోవచ్చని ఏఈఓ రైతులకు సూచించారు. ఈ పంటల పరిశీలన కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి కన్వీనర్ జక్కు గంగారం భూమన్న ఇతర రైతులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
శుక్రవారం | సెప్టెంబర్ 15, 2023 | www.navatelangana.com

ఘన్‌పూర్‌లో ఆరోగ్య మేళా

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండల కేంద్రంలోని ఘన్‌పూర్ గ్రామంలో ఆరోగ్య మేళ కార్యక్రమాన్ని మండల ఆరోగ్య విస్తరణ అధికారి వై శంకర్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్యూనికేబుల్, నాన్ కమ్యూనికేల్ వ్యాధులపై గ్రామ ప్రజలు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పల్లె దవాఖాన ఎంఎల్‌హెచ్‌పి గంగాభవానీ, ఏఎన్ఎంలు గొల్లపల్లి శైలజ, రజిత, ఆశకార్యకర్తలు వనిత, అరుణ, సరితా పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న వైద్యులు

226 వాహనాలకు నేడు బహిరంగ వేలం

నవతెలంగాణ-కంఠేశ్వర్

రెండవసారి 226 వాహనాలకు ఈనెల 20న శుక్రవారం బహిరంగ వేలం వేయనున్నట్టు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సత్యనారాయణ తెలియజేశారు. మొదటి వేలం పాట క్యాన్సల్ చేసినట్టు పేర్కొన్నారు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్లకు సంబంధించి వీధులలో ఆచూకీ లేకుండా వదిలివేసి వెళ్ళిన వివిధ రకములైన మోటార్ సైకిల్లు, ఆటోలు మొత్తం (226) వాహనాలను పోలీసు లైన్, ఎల్లమ్మ గుట్ట, నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ వద్ద ఉంచినట్టు పేర్కొన్నారు. ఈ వాహనాలు నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో బహిరంగ వేలాన్ని ఈ నెల 09న వేయనున్నట్టు తెలిపారు. వివరాలకు 8712659702 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

మంత్రి ప్రశాంత్‌రెడ్డికి మద్దతుగా తీర్మానం



తీర్మానపత్రం అందజేస్తున్న సంఘం సభ్యులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

రాష్ట్ర రోడ్లు భవనాలు, గృహ నిర్మాణ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ అభ్యర్థి వేముల ప్రశాంత్ రెడ్డి కి మద్దతుగా మండలంలోని కోనసముందర్ గ్రామానికి చెందిన విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు తీర్మానం చేశారు. ఈ మేరకు గురువారం సంఘం భవనంలో సర్వసభ్య సమావేశం నిర్వహించుకున్న 30 కుటుంబాలు 120 ఓటర్లు ఉన్న విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు తమ మద్దతు, తమ ఓట్లు మంత్రి ప్రశాంత్‌రెడ్డికేనని పేర్కొంటూ ఏకగ్రీవ తీర్మానం చేశారు. తీర్మానం ప్రతిని సంఘ సభ్యుడు, సర్పంచ్ ఇంద్రాల రాజుకు అందజేశారు. రాష్ట్రంలో కేసీఆర్ జనరంజక పాలన, నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు మద్దతుగా నిలిచేందుకు మంత్రి ప్రశాంత్ రెడ్డికి విశ్వబ్రాహ్మణ సంఘం తరపున ఏకగ్రీవంగా మద్దతు తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు కంచరి దశరథ్, ఉపాధ్యక్షులు గజ్జల చరణ్, ప్రధాన కార్యదర్శి దుర్శనం సుధన్, కోశాధికారి కంచరి జగదీష్, సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై ఇంటింటి సర్వే



సీజనల్ వ్యాధులపై సర్వే చేస్తున్న అధికారులు

నవతెలంగాణ-బాల్కొండ

సీజనల్‌గా వచ్చే వ్యాధుల నివారణ చర్యలో భాగంగా బాల్కొండ కేంద్రంలో గురువారం వైద్యసిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించారు. అందులో భాగంగా దోమలు అభివృద్ధి చెందే ప్రాంతాలైన నిల్వనీరు గల కొబ్బరి బోండాలైన, కూలర్లు, పాతటైర్లు, కుండలు ఇతరత్ర పరిశీలించారు. అనంతరం డెంగ్యూ, మలేరియా, చికన్‌గున్యా లాంటి వ్యాధులు రాకుండా సలహాలు, సూచనలు చేస్తూ దోమల మందు పిచికారీ చేశారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యునిట్ అధికారి మురళి, ఆరోగ్య విస్తరణాధికారి ఆడెపు ప్రభాకర్, ఆరోగ్య కార్యకర్తలు సుజాత, లత, సుజాత ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి సన్మానం



కార్తీక్‌ను సన్మానిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండల కేంద్రంలో ముదిరాజుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తెలంగాణ ముదిరాజుల అధ్యక్షులు చోప్పరి శంకర్ చేతుల మీదుగా నూతనంగా ఎన్నుకోబడ్డ తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి జక్కం కార్తీక్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముదిరాజ్ జిల్లా యువ నాయకులు బొంబాయి రాజు, సోప్పరి వినోద్, బొంబాయి మహేందర్, జక్కం అశోక్, సుధీర్ సున్నం, గంగప్రసాద్, ప్రశాంత్, నాగరాజు, జాన్సన్, వెంకటేష్, లక్ష్మణ్, కుమార్, సాయిచరణ్, దిలీప్, ప్రేమ్‌కుమార్, రాజేశ్వర్, ముదిరాజ్ యువజన నాయకులు పాల్గొన్నారు.

రేపు బొజ్జతారకం ఏడవ వర్ధంతి సభ

- విజయవంతం చేయండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

దళిత నేత, ప్రజా న్యాయవాది హక్కులనేత బొజ్జ తారకం ఏడవ వర్ధంతి సభను ఈనెల 16న శనివారం జిల్లా కేంద్రంలో గల న్యూ అంబేద్కర్ భవన్లో నిర్వహిస్తున్నామని సభను విజయవంతం చేయడానికి దళితులు, ప్రజాసంఘాలు, హక్కుల సంఘాల కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షులు ఎల్లం, ఏఐకేఎంఎస్ నాయకులు ఆకుల పాపయ్య, బుద్ధిష్టు సొసైటీ జిల్లా అధ్యక్షులు అశోక్ కోరారు. మాల మహానాడు, ఏఐకేఎంఎస్, బుద్ధిష్టు సొసైటీల ఆధ్వర్యంలో ఎన్నార్ భవన్ కోటగల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తారకం వర్ధంతి సందర్భంగా కరపత్రాన్ని ఆవిష్కరించారు. ధనరాజు, ఆకుల పాపయ్య, భట్టి గంగాధర్, అశోక్ మాట్లాడుతూ ఈ జిల్లాలో అట్టడుగున ఉన్న అణగారిన ప్రజల కోసం దళితుల కోసం కార్మికుల కోసం అనేక పోరాటాలు నిర్వహించిన మహా నాయకుడు తారకం అని వారన్నారు. కుల వివక్షతకు వ్యతిరేకంగా కుల నిర్మూలనకు పరితపించి జిల్లాలో అంబేద్కర్ సంఘాలు నిర్మాణనికై దానితో పాటు రెండు గ్లాసుల సిస్టం రద్దుకై దళితులను ఐక్యపరిచి వారిలో చైతన్య స్థాయిని నింపిన గొప్ప నాయకుడని వారన్నారు. కార్యక్రమంలో ధనరాజ్, బట్టి గంగాధర్, వేల్పూర్ భూమయ్య, వినయ్ కుమార్, నారాయణ, రామచందర్, శివకుమార్, బాలస్వామి, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

గణేష్ విగ్రహ ప్రతిమల ఏర్పాటుకు
దరఖాస్తు చేసుకోవాలి

- సీపీ సత్యనారాయణ వెల్లడి

నవతెలంగాణ-కంఠేశ్వర్

గణేష్ విగ్రహ ప్రతిమల ఏర్పాటుకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ వి సత్యనారాయణ వెల్లడించారు. గురువారం విలేకరుల సమావేశం సిపి కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంస్కృతి సంప్రదాయాలకు నిలయమైన పండుగలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలన్నారు. వినాయక ఉత్సవాలను నిర్వహించే సంఘాల వారు నిర్దేశించిన లింక్ ద్వారా విగ్రహాన్ని ప్రతిష్టించే రోజు, సమయం, దారి వివరాలను పొందుపరచాలని తెలిపారు.

4వ టౌన్‌ను తనిఖీ చేసిన పోలీస్ కమిషనర్.. నిజామాబాద్ పోలీస్ కమీషనర్ వి.సత్యనారాయణ 4వ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మొట్టమొదలు పోలీస్‌స్టేషన్లోని అన్ని ప్రదేశాలను కలియదిరిగి స్టేషన్లో పరిశుభ్రత ఎలా ఉందనే విషయం తెలుసుకున్నారు. అనంతరం రిసెప్షన్ కౌంటర్‌కు వెళ్లారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుడికి ఎలాంటి గౌరవం ఇస్తారు? వారి ఇబ్బందిని ఎలా తెలుసుకుంటారు? ప్రతీ ఫిర్యాదును అంతర్జాలంలో నమోదు చేయాలని, అనంతరం పోలీస్‌స్టేషన్లో 5ఎస్ విధానం అమలు కోసం తీసుకుంటున్న చర్యలు క్షుణ్ణంగా చూశారు. పోలీస్ స్టేషన్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. త్వరలో వినాయకచవితి, మిలాద్-ఉన్-నబీ పండుగల సందర్భంగా పటిష్ట బందోబస్తు చర్యలు తీసుకోవాలని, ఎలాంటి సమస్యలు రాకుండా నిఘా వ్యవస్థను పటిష్ట పర్చాలని, ప్రజలతో ఫ్రెండ్లీ పోలీస్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని, పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదు దారులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని, వారి ఫిర్యాదులను త్వరగా పరిష్కరించుటకు తగుచర్యలు తీసుకోవాలని తెలియజేశారు. అనంతరం సిబ్బంది సాధకబాదలు తెలుసుకొని వాటి పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు తెలియజేశారు. ఈ సందర్భంగా నిజామాబాద్ ఎ.సి.పి ఎమ్.కిరణ్‌కుమార్, 4వ టౌన్ ఎస్.ఐ బి.సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.



పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న కమిషనర్

అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రేగుంట దేవేందర్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

గ్రామాల్లో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రేగుంట దేవేందర్ అన్నారు. గురువారం మండలంలోని అమీర్‌నగర్, నర్సాపూర్ గ్రామాల్లో రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రేగుంట దేవేందర్ మాట్లాడుతూ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డిని ముచ్చటగా మూడసారి బాల్కొండ ఎమ్మెల్యేగా గెలిపించే బాధ్యత కార్యకర్తలదేనని అన్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చినప్పటి నుండి మండలంలోని అన్ని గ్రామాలు అభివృద్ధి అభివృద్ధి సాధించాయన్నారు. మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి చేసిన అభివృద్ధి కార్యక్రమాలు కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి ప్రజలకు వివరించి, చేసిన అభివృద్ధి పనులు చెప్పడం ద్వారా మళ్లీ ప్రశాంత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించే బాధ్యతను కార్యకర్తలు తమ భుజాలపై వేసుకోవాలన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో మంత్రి ప్రశాంత్‌రెడ్డి జనరంజక పాలన అందిస్తున్నారని పేర్కొన్నారు. పెన్షన్లు, రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, తదితర సంక్షేమ పథకాలు అమలు, గ్రామంలోని జరిగిన అభివృద్ధిని కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని ముఖ్య కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ బద్దం రాజేశ్వర్, బిఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా మండల కన్వీనర్ బోడ దేవేందర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాలవత్ ప్రకాష్, అమీర్ నగర్ సర్పంచ్ పుప్పల గంగాధర్, విండో వైస్ చైర్మన్ ఆకుల రాజన్న, గ్రామ శాఖ అధ్యక్షులు గంగం గంగారెడ్డి, నర్సాపూర్ సర్పంచ్ పెండే ప్రభాకర్, గ్రామశాఖ అధ్యక్షుడు బుస్సాపురం జీవన్, విండో డైరెక్టర్ బుస్సాపురం నవీన్, పార్టీ సీనియర్ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న దేవేందర్

మెండోరాలో రోడ్డుపై పారుతున్న మురికి నీరు

- సమస్యను పరిష్కరించాలని కాలనీవాసుల వినతి

నవతెలంగాణ-భీంగల్

మండ లంలోని మెండోరా గ్రామంలో బస్టాండ్ వద్ద మురికి నీరు రోడ్డుపై పారుతుండడంతో ఆ కాలనీలో మురికి నీరుతో దుర్గంధం వెదజల్లే పరిసర ప్రాంతవాసులు తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై కాలనీవాసులు ఎంపీడీవో రాజేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. దీంతో స్పందించిన ఎంపీడీవో సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. గతంలోనూ ఎంపీడీవోకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదన్నారు. గ్రామంలోని మురికికాలువ ద్వారా వస్తున్న మురికి నీరు రోడ్డుపై పారుతూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆ కాలనీవాసులు సంవత్సరం క్రితమే ఎంపీడీవో రాజేశ్వర్‌కు వినతిపత్రం అందజేయగా, స్వయంగా ఎంపీడీవో మెండోరాకు వెళ్లి పరిశీలించి ఈ విషయమై ప్రజాప్రతినిధులకు పరిష్కరించాలని తెలియజేసినట్లు ఎంపీడీవో తెలిపారు.



రోడ్డుపైనుంచి పారుతున్న మురికినీరు

బతికుండగా ఇవ్వకుండా.. చచ్చాక ఇస్తారా?

బతుకమ్మ ఆడుతూ అంగన్‌వాడీల నిరసన

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

తమ డిమాండ్లు పరిష్కరించాలని, గతంలో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని అంగన్వాడీ ఉద్యోగులు చేస్తున్న నిరవధిక సమ్మె కొనసాగుతుంది. అయితే బతికున్నప్పుడు కావాల్సిన వాటిని పక్కకు పెట్టి, చనిపోయాక దహన సంస్కారాలకు డబ్బులు ఇస్తామనడం దుర్మార్గపు చర్యగా అంగన్‌వాడీలు అభివర్ణించారు. మండల కేంద్రంలోని హాసకొత్తూర్ చౌరస్తా వద్ద నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె గురువారంతో నాలుగో రోజుకు చేరుకుంది. సమ్మె శిబిరం వద్ద అంగన్వాడి ఉద్యోగులు బతుకమ్మతో ప్రభుత్వానికి తమ నిరసనను తెలియజేశారు. ఈ సందర్భంగా అంగన్వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించడంలో అంగన్వాడీ ఉద్యోగులు అందిస్తున్న సేవలను ప్రభుత్వం విస్మరిస్తుందన్నారు. నాలుగు రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి అంగన్వాడి ఉద్యోగులను క్రమబద్ధీకరించడంతోపాటు సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం అంగన్వాడిల చెవుల్లో పువ్వులు పెట్టే ప్రయత్నం చేస్తుందని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ భీమ్‌గల్ ప్రాజెక్టు ఉపాధ్యక్షురాలు యమున, మండల అధ్యక్షురాలు మంజుల,



నిరసన తెలపుతున్న టీచర్లు

పిప్రి పోస్ట్ మాస్టర్‌కు సన్మానం

నవతెలంగాణ-భీమ్‌గల్

తెలంగాణ సర్కిల్‌లో తపాలా శాఖ ద్వారా ఖాతాల ఓపెనింగ్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి భారత దేశంలో ప్రథమ స్థానంలో నిలిచిన బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ అప్సర్‌ను మండల పోస్టుమాస్టర్లు శాలువాతో సన్మానించారు. పిప్రి గ్రామానికి చెందిన బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ తపాలా శాఖ ద్వారా తెలంగాణ సర్కిల్‌లో నుండి దేశంలోనే ఎక్కువ మొత్తంలో పొదుపు ఖాతాలను ఓపెన్ చేయించారు. ఈ మేరకు గురువారం భీంగల్ పోస్టల్ కార్యాలయంలో అప్సర్‌ను సన్మానం చేశారు. పూల మాల, శాలువాతో సత్కరించి, జ్ఞాపిక అందజేశారు. ఈ సందర్భంగా పోస్టల్ ఉద్యోగులు ఉత్తమ ప్రతిభ కనబరిచిన బీపీఎమ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా పని చేయాలన్నారు. ప్రతి ఉద్యోగి విధి నిర్వహణలో భాగంగా పోస్టల్ డెలివరీ, నగదు బదిలీ, కొత్త ఖాతాల ఓపెనింగ్, ఇన్సూరెన్స్ తో పాటు తపాలా శాఖ ద్వారా అందజేస్తున్న పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పిఎం మదన్‌లాల్, పోస్ట్‌మెన్ బాలకృష్ణ, ముత్తన్న, రాములు సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ ద్వారానే మాదిగల అభివృద్ధి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఈనెలలో పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించి ఎన్నికల సమయంలో బీజేపీ ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని ఎంఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి భైరపోగు శివకుమార్ మాదిగ అన్నారు. మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు తెలంగాణ యూనివర్సిటీలోని మినీ సెమినార్ హాల్‌లో మాదిగ స్టూడెంట్ ఫెడరేషన్ ఎంఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థి సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భైరపోగు శివకుమార్ మాదిగ పాల్గొని మాట్లాడుతూ.. బీజేపీ ఏదైనా ఒక సామాజిక అంశానికి సుదీర్ఘకాలం మద్దతుగా ఉన్నదంటే అది కేవలం ఎస్సీ వర్గీకరణకు మాత్రమేనన్నారు. ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో జరిగే ప్రతి కార్యక్రమానికి సభలకు సమావేశాలకు వచ్చి వర్గీకరణ మీద మాట ఇచ్చి మోసం చేస్తుందని అన్నారు. బీజేపీ పార్టీ మాటలకు పరిమితం కాకుండా ఈ నెల 18 నుండి 22 వరకు జరిగే ప్రత్యేక పార్లమెంటు సమావేశంలో ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్రం తక్షణమే స్పందించి 18 నుండి జరుగుతున్న ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలే చివరి సమావేశాలని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో బిజేపీ ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. బివిఎం, ఎన్ఎస్‌యుఐ, ఎస్ఎఫ్ఐ, బిసి విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ ఒక కులానికి సంబంధించింది కాదని ఇది సామాజిక న్యాయం బాబాసాహెబ్ అంబేద్కర్ కల్పించిన రిజర్వేషన్లు అందరికీ సమానంగా జనాభా నిష్పత్తి ప్రకారం అందించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎమ్మెస్ ఎఫ్ ఆధ్వర్యంలో తీసుకునే ప్రతి కార్యక్రమంలో విద్యార్థి సంఘాలుగా మేము భాగస్వామ్యం అవుతామని వివిధ సంఘాల నాయకులు తెలిపారు. ఎమ్మెస్ఎఫ్ యూనివర్సిటీ అధ్యక్షులు దినేష్ మాదిగ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో అర్బాస్‌ఖాన్, కామారెడ్డి జిల్లా అధ్యక్షులు, కోమిరా శ్రీశైలం, ప్రసాద్, అనిల్, వెంకటరమణ, అఖిల్, రాజ్ కుమార్, నవీన్, శ్రవణ్, సుజన్, ముకేశ్, అతిఫ్, రెహమాన్, మహిళా నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శివకుమార్

సీఎంఆర్ఎఫ్.. పేదవారికి ఆపన్నహస్తం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ మండల కార్యాలయం వద్ద గురువారం రాష్ట్ర మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సహకారంతో 36 మంది లబ్దిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి ఆర్థిక సహాయం చెక్కులను అందజేశారు. మండలంలోని కమ్మర్‌పల్లి, హాసకొత్తూర్, చౌట్‌పల్లి, నర్సాపూర్, కోనాపూర్, కొనసముందర్, ఇనాయత్‌నగర్, అమీర్‌నగర్, బషీరాబాద్, ఉప్లూర్, నాగపూర్ గ్రామాలకు చెందిన 36 మంది లబ్దిదారులకు బిఆర్ఎస్ నాయకులు చెక్కులను అందజేశారు. లబ్దిదారులందరికీ కలిపి ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ప్రభుత్వం రూ.15లక్షల 21వేల 500 విలువైన చెక్కులను మంజూరు చేసింది. ఆ చెక్కులను లబ్దిదారులకు మండల పార్టీ అధ్యక్షుడు రేగుంట దేవేందర్, ఎంపీపీ అధ్యక్షురాలు లోలపు గౌతమి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర రోడ్ల భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పెద్ద సంఖ్యలో లబ్దిదారులకు చెక్కులను అందించడం సంతోషంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా పేద, సామాన్య ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందని, ఈ పథకం ద్వారా ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలను ఆదుకుంటున్నారని తెలిపారు. లబ్దిదారుల కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి ప్రశాంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు మల్యాల సుభాష్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి ఏనుగు గంగారెడ్డి, గ్రామశాఖ అధ్యక్షులు చింత గణేష్, బైకని మహేష్, తెడ్డు కిరీటి, సర్పంచ్‌లు మారు శంకర్, పెండె ప్రభాకర్, ఎంపీటీసీ సభ్యులు మైలారం సుధాకర్, పిప్పెర అనిల్, రైతుబంధు గ్రామ కోఆర్డినేటర్ బోడ దేవేందర్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు లోలపు సుమన్, పాలెపు రవికిరణ్, బద్దం రాజశేఖర్, కట్ట చిరంజీవి, సుంకరి మురళి, సంత రాజేశ్వర్, హరీష్‌రెడ్డి, రఘు, సైదు నర్సయ్య, బక్కూరి గోపి, మహేష్, లింగారెడ్డి, శంకర్‌రెడ్డి, వివిధ గ్రామాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



చెక్కులు అందజేస్తున్న దృశ్యం

చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలి

నవతెలంగాణ-రెంజల్

ఐదు సంవత్సరాల లోపు చిన్నారులను అంగన్వాడి కేంద్రాల్లోనే చేర్పించాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ ప్రమీల రాణి పేర్కొన్నారు. గురువారం వీరన్నగుట్ట అంగన్వాడి కేంద్రంలో పోషణ మాసాన్ని పురస్కరించుకొని సర్పంచ్ బైండ్ల రాజు చిన్నారులకు అన్నప్రసన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదు సంవత్సరాలలోపు పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపవద్దని తల్లులకు అవగాహన కల్పించారు. నూతనంగా తమ పేర్ల నమోదు చేసుకున్న బాలింత గర్భిణీ మహిళలను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. వేడి అన్నం తీసుకోవాలని, ఆకుకూరలు, గుడ్లు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. మహిళలను నిర్లక్ష్యం చేయకుండా అంగన్వాడీ కేంద్రంలో పౌష్టికాహారాన్ని తప్పకుండా అందించాలన్నారు. చిన్నారుల ఎత్తు బరువులను చూసి వారికి తగినంత పోషకారాన్ని అందించాలని అంగన్వాడీ టీచర్లను ఆదేశించారు. ప్రతి కుటుంబం తమ పెరట్లో సేంద్రియ ఎరువులతో ఆకుకూరలు పెంచుకోవాలని సూచించారు. నెలలు నిండిన ఇద్దరు చిన్నారులకు సర్పంచ్ రాగి జావా, జొన్న జావాలను అందించారు. గర్భిణీ బాలింత మహిళలకు అందించే ఆహారాన్ని సర్పంచ్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు విజయలక్ష్మి, బి.శాంత శాంత కుమారి, ఆశలు కవిత, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I,VANJARI RAJARAM (Old Name) R/o H. No. 3-57, Kammarpally Village & Mandal, Dist. Nizamabad, hereby Declare that, I have Changed my Name as POTHANKAR RAJARAM (New Name)

IN THE COURT OF THE HON'BLE PRL. DISTRICT JUDGE AT NIZAMABAD

I.A. No. 510 Of 2023
IN
A.S. No. of 2023

Between:
1. Jinna Raju W/o Late Jinna Rajeshwar, Aged 42 Years, Occ: Agriculture, R/o Kammarpally Village and Mandal, Dist. Nizamabad,
2. Jinna Raj Kumar S/oLate Jinna Rajeshwar, Aged about 24 Years, occ: Agriculture, R/o Kammarpally Village and Mandal, Dist. Nizamabad,
...Petitioners / Appellants / Defendants

And

Renjarla Bajaiah S/o Late Renjarla Yerra Bhumanna, Aged 43 Years, Occ: Private Employee, R/o Uploor Village of Kammarpally Mandal, Dist. Nizamabad
...Respondent / Respondent / Plaintiff

To
Renjarla Bajaiah S/o Late Renjarla Yerra Bhumanna, Aged 43 Years, Occ: Private Employee, R/o Uploor Village of Kammarpally Mandal, Dist. Nizamabad

Whereas the Petitioners / Appellants / Defendants have filed petition U/s. 5 of Limitation Act, to Condone the delay of (214) days in registering Appeal Suit and same was posted for your hearing & counter on 03-10-2023.

Take notice that in the above case, if any objections or claims for above petition, you are directed to appear before this hon'ble court on 03-10-2023 at 10:30 A.M, either in person or through a counsel duly authorized, failing which the above subjected matter will be heard and decided as per law.

//BY ORDER OF THE COURT //

E. Bhagee Charan
Advocate, Nizamabad

కస్తూర్బాగాంధీ పాఠశాల తనిఖీ

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలను సర్పంచ్ ఎమ్మెస్ రమేష్ కుమార్, ఎంపీటీసీ గౌసొద్దీన్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇటీవల భీమ్‌గల్ పాఠశాలలో సుమారు 103 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన నేపథ్యంలో అధికారులు ప్రజా ప్రతినిధులు పాఠశాలలపై ప్రత్యేక దృష్టిని సారించారు. పాఠశాలలో వంట పాత్రలు శుభ్రంగా ఉంచడమే కాకుండా, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వారు సూచించారు. వందలాదిమంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నందున, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని వారు సూచించారు. సీజనల్ వ్యాధులు రాకుండా సిబ్బంది పాఠశాలలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వేడి అన్నంతో పాటు కూరగాయలను పరిశుభ్రమైన ప్రదేశంలో ఉంచుకోవాలని వారు సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు రహిమాన్, గంగాధర్ పాఠశాల నిర్వాహకురాలు శ్యామల, సుజాత తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాల పేరుతో మోసగించిన బషీర్ నుంచి డబ్బులు ఇప్పించాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

గల్ఫ్‌లో ఉద్యోగాల పేరుతో మోసగించిన షేక్ బషీర్‌పై పిడీ యాక్ట్ పెట్టి, అతని నుండి డబ్బులు వాపస్ ఇప్పించాలని ప్రవాస భారతీయుల హక్కుల సంక్షేమ వేదిక అధ్యక్షుడు కోటపాటి నరసింహానాయుడు అన్నారు. గురువారం సిపి సత్యనారాయణకు వినతిపత్రం అందజేసి ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిచ్‌పల్లిలో ఆర్కే ట్రావెల్స్ పేరుతో ఆఫీస్ పెట్టి షేక్ బషీర్ ఎడపల్లి మండలంలోని ఎంఎస్సి ఫారం గ్రామానికి చెందిన వ్యక్తి వందలాది మంది దగ్గర 25 వేల నుండి 50 వేల వరకు వసూలు చేసి పరారయ్యాడని, సుమారుగా 10 నెలల తర్వాత నిందితుడిని పట్టుకున్నారని తెలిపారు. అతను బెయిల్‌పై విడుదలయ్యాడని, అయినా బాధితులకు న్యాయం జరగలేదని ఆరోపించారు. ఈ విషయమై బాధితులకు న్యాయం చేయాలని కోరారు.

డ్రైవింగ్ లైసెన్స్‌లతో పాటు హెల్మెట్‌లనూ ఉచితంగా అందిస్తా

- మంత్రి వేముల

నవతెలంగాణ-ఏర్గట్ల

డ్రైవింగ్ లైసెన్స్‌లతో పాటు హెల్మెట్‌లనూ ఉచితంగా అందిస్తానని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని రాజరాజేశ్వరి ఫంక్షన్‌హాల్‌లో మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉచిత డ్రైవింగ్ (లెర్నింగ్) లైసెన్స్‌లను ఆయన చేతుల మీదుగా దరఖాస్తు చేసుకున్న వారికి గురువారం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి ప్రశాంత్ రెడ్డి లెర్నింగ్ డ్రైవింగ్ లైసెన్స్‌లు అందుకున్న వారిని ఉద్దేశించి మాట్లాడుతూ.. డ్రైవింగ్ లైసెన్స్ తీయాలంటే ఖర్చుతో కూడుకున్న పని అని అందరికి లైసెన్స్‌లు రావాలంటే దాదాపు సంవత్సరంకు పైన పట్టేదని, మీ కోసం హైదరాబాద్ నుండి అధునాతన



లెర్నింగ్ డ్రైవింగ్ లైసెన్సులను పంపిణీ చేస్తున్న మంత్రి

టెక్నాలజీని తెప్పించి కేవలం వారం రోజుల్లోనే లెర్నింగ్ డ్రైవింగ్ లైసెన్స్ ఇప్పించానని అన్నారు. యువతకు ఇబ్బంది కాకుండా లెర్నింగ్ డ్రైవింగ్ లైసెన్స్ వచ్చిన వారికి హెల్మెట్లు కూడా ఉచితంగా అందిస్తానని అన్నారు. దీనిని కూడా రాజకీయం చేయొద్దని, కేవలం సేవాభావంతో ఉచితంగా డ్రైవింగ్ లైసెన్స్‌లను, 10 రోజుల్లో హెల్మెట్లు కూడా అందజేస్తానని అన్నారు. ముఖ్యంగా యువత డ్రైవింగ్ చేస్తూ.. సెల్‌ఫోన్ మాట్లాడవద్దని, కచ్చితంగా హెల్మెట్ ధరించాలని, మీ కుటుంబాలను ఆగం చేయవద్దని కోరారు. కార్యక్రమంలో రైతు నాయకులు కోటపాటి నర్సింహ నాయుడు, ఎంపీపీ ఉపేందర్ రెడ్డి, జడ్పీటీసీ గుల్లే రాజేశ్వర్, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు పూర్ణానందం, ఎంపీటీసీ జక్కని మధు సూదన్, కోఆప్షన్ మెంబర్ అష్రాఫ్, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి బద్దం శ్రీనివాస్‌రెడ్డి, అన్ని గ్రామాల సర్పంచ్లు, ఏర్గట్ల, తాళ్లరాంపూర్ పీఏసీఎస్ అధ్యక్షులు బర్మ చిన్న నర్సయ్య, పెద్దకాపుల శ్రీనివాస్‌రెడ్డి, రైతుబంధు సమితి మండలాధ్యక్షులు సున్నపు అంజయ్య, జిల్లా మెంబర్ నెరేళ్ళ లింగారెడ్డి, ఏర్గట్ల బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు తుపాకుల శ్రీనివాస్ గౌడ్, ఆర్డీఓ వినోద్, ఎమ్మార్వో మహమ్మద్ యూసుఫ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులకు ఏకకాలంలో 2 లక్షల రుణమాఫీ

- కాంగ్రెస్ నేత ముత్యాల సునీల్ కుమార్



ప్రజలతో మాట్లాడుతున్న సునీల్‌రెడ్డి

నవతెలంగాణ-భీంగల్

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు ఏకాకాలంలో రెండు లక్షల రూపాయలను రుణమాఫీ చేయనున్నట్లు కాంగ్రెస్ నాయకుడు ముత్యాల సునీల్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని జాగిర్యాల్, సుదర్శన్ తాండా, సంతోష్ నగర్ తాండలలో పల్లె పల్లెకు గుండెగుండెకు కాంగ్రెస్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ముత్యాల సునీల్‌రెడ్డి ఇంటింటి ప్రచారం నిర్వహించి రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం లక్ష రూపాయలు రుణమాఫీ చేస్తామని చెప్పి మోసం చేసిందని వారు చేస్తున్న మాఫీ వడ్డీకి కూడా సరిపోవడం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేస్తామని తెలిపారు. అలాగే 500 రూపాయలకు గ్యాస్ సిలిండర్, 15వేల రూపాయలను రైతు పెట్టుబడి సాయం, భూమి లేని ఉపాధి కూలీలకు సంవత్సరానికి 12 వేలు అందించనున్నామన్నారు. దీంతోపాటు ప్రభుత్వం వచ్చిన తొలి యాడాదిలోనే 2 లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి చెల్లిస్తామని తెలిపారు. ఈసారి కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇచ్చి తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు స్వామి, నాయకులు శివరాం నాయక్, రమేష్, నరసయ్య, గోపాల్ నాయక్, రవి బొర్రన్న, అనంతరావు పాల్గొన్నారు.

పట్టణ, పల్లెప్రగతిలో మరింత అభివృద్ధి పనులు

- విద్యుత్ శాఖ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ జె శ్రీధర్

నవతెలంగాణ-ఆర్మూర్



తెలంగాణ ప్రభుత్వ హయాంలో పట్టణ, పల్లెప్రగతి కార్యక్రమాల్లో భాగంగా మరింత అభివృద్ధి పనులు జరిగాయని విద్యుత్ శాఖ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ జె.శ్రీధర్ గురువారం తెలిపారు. తెలంగాణ పురోగతిలో ప్రధాన భూమికని పోషిస్తున్న ఇంజనీర్ల దినోత్సవం నేడు అని, మోక్షగుండం విశ్వేశ్వరయ్య స్మారకార్థం ఇంజనీర్స్ డేను ఆయన జయంతి రోజున జరుపుకోవడం అభినందనీయమని అన్నారు. విద్యుత్ శాఖ ద్వారా ప్రజలకు, రైతులకు నిర్విరామ సేవలు చేస్తున్నట్లు తెలిపారు.

కేజీబీవీలో కలుషిత ఆహారంతోనే విద్యార్థులు అస్వస్థత

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



కలెక్టరేట్ వద్ద కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ సభ్యులు

కస్తూర్బా గురుకుల పాఠశాలలో కలుషిత ఆహారంతో విద్యార్థులు అస్వస్థతకు గురైన భీంగల్ పాఠశాలను కౌన్సిల్ ఫర్ సిటిజన్ రైట్స్ సభ్యులు పరిశీలించి కలెక్టర్‌కు గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. నిజామాబాద్ జిల్లా భీంగల్ కస్తూర్బా గురుకుల పాఠశాలలో కలుషిత ఆహారం తిని దాదాపు 100 మందికిపైగా విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని, అక్కడున్న సమస్యలను లిఖితపూర్వకంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. గురుకుల పాఠశాల చుట్టూ ప్రహరీ గోడ లేకపోవడంతో శునకాలు స్వైరవిహారం చేస్తూ పరిసరాలను అపరిశుభ్రం చేస్తున్నాయని అన్నారు. పాఠశాల పక్కనే భీమ్‌గల్ మున్సిపాలిటీకి చెందిన డంపింగ్ యార్డ్ ఉండటం వలన పాఠశాలనైనా, డంపింగ్ యార్డ్‌నైనా వేరే చోటికి తరలించాలన్నారు. అదేవిధంగా నాసిరకమైన వంట సామాగ్రిని గుర్తించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుట, వంటగదిని, డైనింగ్ హాలు ను ఎప్పటికప్పుడు శుభ్రపరిచే చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సంస్థ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజశేఖర్, బాలలింగం, మహేందర్ గౌడ్, సాయన్న, రమేష్, సురేష్, పాల్గొన్నారు.

కాంగ్రెస్ విజయభేరి సభను విజయవంతం చేయండి

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి

నవతెలంగాణ-కంఠేశ్వర్

అధిక సంఖ్యలో పాల్గొని కాంగ్రెస్ విజయభేరి సభను విజయవంతం చేయాలని ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఇచ్చిన సోనియాగాంధీకి ఘన స్వాగతం పలుకుదామని జిల్లా ప్రజలకు నిజామాబాద్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం కాంగ్రెస్ భవన్ నందు నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి, పిసిసి ఉపాధ్యక్షులు తాహెర్‌బిన్ హందాన్, నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కేశ వేణు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మోహన్‌రెడ్డి మాట్లాడుతూ నిజామాబాద్ పార్లమెంట్ అబ్జర్వర్ బీఎం నాగరాజు ఆధ్వర్యంలో ఆర్మూర్, నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలో సెప్టెంబర్ 17వ తేదీన తుక్కుగూడలో కాంగ్రెస్ విజయభేరి బహిరంగ సభకు నిజామాబాద్ నుండి జన సమీకరణ గురించి ప్రణాళిక చేపట్టినట్టు అన్నారు. ఇందులో భాగంగా నియోజకవర్గంలోని ఎమ్మెల్యే టికెట్ కోసం నమోదు చేసుకున్న అభ్యర్థులతో సమావేశమై జన సమీకరణకు కావలసిన వాహనాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కావున కాంగ్రెస్ మండల అధ్యక్షులు తమ మండల కేంద్రాలలో కాంగ్రెస్ నాయకుల సమావేశాలు, పత్రికా సమావేశాలు నిర్వహించి కాంగ్రెస్ విజయభేరి బహిరంగ సభపై ప్రజలను జాగృతం చేయాలని, ప్రతి మండలం నుంచి అధిక సంఖ్యలో జన సమీకరణ చేయాలని, ప్రజల్ని సభకు తీసుకువెళ్లడానికి కావలసిన రవాణా సౌకర్యాన్ని మీ నియోజకవర్గానికి సంబంధించిన ఎమ్మెల్యే అభ్యర్థులు వాహనాలను ఏర్పాటు చేస్తారని వారిని సంప్రదించాలని ఆయన అన్నారు. అదేవిధంగా కాంగ్రెస్ విజయభేరి బహిరంగ సభ కోసం నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గానికి బాలరాజుని, రూరల్ నియోజకవర్గానికి మహమ్మద్ ఈసాని, బాల్కొండ నియోజకవర్గానికి అన్నయ్య గౌడ్‌ని, ఆర్మూర్ నియోజకవర్గానికి రాంభూపాల్‌ని, బోధన్ నియోజకవర్గానికి శేఖర్‌గౌడ్‌ని కోఆర్డినేటర్లుగా నియమించినట్టు తెలిపారు. కావున ఈ సమావేశానికి నిజామాబాద్ నగరం నుండి అధిక



మాట్లాడుతున్న మోహన్‌రెడ్డి

సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు. కావున సెప్టెంబర్ 17వ తేదీన ఉదయం 10 గంటలకు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలు కాంగ్రెస్ భవన్ వద్దకు రావాలని ఇక్కడి నుండి బహిరంగ సభకు ర్యాలీగా బయలుదేరుదామని కేశ వేణు అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు రత్నాకర్, భక్త వత్సలం, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు వేణు రాజ్, కాంగ్రెస్ విజయభేరి నిజామాబాద్ రూరల్ కోఆర్డినేటర్ ఈసా, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిరికొండ గంగారెడ్డి, అష్రఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ బిల్లును చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఎంఆర్పిఎస్ జిల్లా కమిటి ఆధ్వర్యంలో నిజామాబాద్ పట్టణంలో ధర్నా చౌక్‌లో నిరసన దీక్షలు చేపట్టారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ బిల్లును ఈ నెల 18 నుండి 22 వరకు జరిగే ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలలో ఆమోదించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన దీక్షలకు ముఖ్య అతిథిగా ఎంఆర్పిఎస్ నిజామాబాద్ జిల్లా ఇంఛార్జి శనిగారం మురళి కృష్ణ మాదిగ హాజరై దీక్షలను ప్రారంభించారు. మాదిగ సమాజం మొత్తం కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పార్టీపై నమ్మకం పెట్టుకుందని, 9ఏండ్ల అధికారంలో వర్గీకరణ బిల్లును చేస్తాం అని చెప్పనే మోసం చేస్తుందని, బీజేపీకి ఇదే చివరి అవకాశం అని, వచ్చే ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలలో బిల్లు పెట్టకపోతే బీజేపీయే మాదిగల ప్రధాన శత్రువుగా మాదిగ సమాజం భావించాల్సి ఉంటుందని అన్నారు. కాంగ్రెస్ ప్రధాన ప్రతిపక్షంగా ఉండి ఏనాడూ కేంద్ర ప్రభుత్వం మీద బిల్లు పెట్టాలని ఒత్తిడి



దీక్షలో పాల్గొన్న నాయకులు

తీసుకురాకపోవడం అత్యంత బాధాకరం అని అన్నారు. 'కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు బీజేపీ పెద్దలు కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పెద్దలకు లేఖ రాసింది బిల్లు పెడితే మద్దతు ఇస్తాం అన్నది. కానీ ఇప్పుడు బీజేపీ అధికారంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ పెద్దలు రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, మాత్రం లేఖ రాయకపోవడం అంటే మాదిగలను మోసం చేయడమే అవుతుంది' అని అన్నారు. బీజేపీ బిల్లు పెట్టకపోతే కాంగ్రెస్ ముందుకు వచ్చి ప్రైవేట్ బిల్లు పెట్టాలని డిమాండ్ చేస్తున్నామని అన్నారు. అలాగే తెలంగాణలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఢిల్లీకి అఖిల పక్షం తీసుకెళ్ళి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సిన బాధ్యత ఉందని, అఖిల పక్షం కేసిఆర్ తీసుకోకపోతే ఇక్కడ తెలంగాణలో మాదిగల సత్తా ఏంటో చూపిస్తాం అని హెచ్చరించారు. ఈ నిరసన దీక్షలో ఎంఎస్పి జిల్లా సీనియర్ నాయకులు మనికొల్ల గంగాధర్, దల్ల సురేష్, సరికెల పోషెట్టి, మాదిగల మహిళ సమాఖ్య నాయకులు పెద్దోళ్ల యమున, సుధ, ఎంఆర్పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగం రాజేష్, జిల్లా ఉపాధ్యక్షులు రొడ్డ ప్రవీణ్, ఆకారం రమేష్ మాదిగ, జిల్లా సంయుక్త కార్యదర్శి ఐలపాక సుమన్ మాదిగ, జిల్లా కార్యదర్శి తాలపక సుమన్ మాదిగ, ఎంఆర్పిఎస్ నాయకులు గుర్రాల మోహన్ మాదిగ, సంజీవ్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మనసికోల్లాసం..

- ఒలంపిక్ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు, ధర్పల్లి జడ్పీటీసి బాజిరెడ్డి జగన్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

క్రీడలతో మనసికోల్లాసం విరాజిల్లుతోందని, తాము ఎంచుకున్న పోటీల్లో ప్రతిభ ఆధారంగానే ప్రభుత్వ ఉద్యోగం సంపాదించవచ్చని ఒలంపిక్ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు, ధర్పల్లి జడ్పీటీసి బాజిరెడ్డి జగన్ మోహన్ అన్నారు. బుధవారం ఇందల్‌వాయి మండలంలోని ఇందల్‌వాయి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 67వ ఎస్‌జిఎఫ్ మండల స్థాయి 10నుండి 13వరకు జరిగే క్రీడా పోటీల ముగింపు కార్యక్రమానికి ఎంపీపీ బాదవత్ రమేష్ నాయక్, ఐడిసిఎంఎస్ చైర్మన్ సాంబార్ మోహన్‌తో కలిసి పాల్గొని మెమోంటోలను గెలుపొందిన జట్లకు అందజేశారు. ఈ సందర్భంగా బాజిరెడ్డి జగన్ మోహన్ మాట్లాడుతూ ఏదైనా క్రీడా పోటీల్లో గెలుపోటములు సహజమని, గెలిచినా, ఓడినా నిరుత్సాహపడకుండా రాబోయే పోటీల్లో తమలో దాగి ఉన్న క్రీడా నైపుణ్యం ప్రదర్శించి గెలుపే ధ్యేయంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మండలస్థాయి స్కూల్ గేమ్స్ నిర్వహణ కోసం కలెక్టర్ నిధుల నుంచే కాకుండా ఆర్టీసీ చైర్మన్ నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ దృష్టికి తీసుకుని వెళ్లి మండల స్థాయి క్రీడా పోటీలకు ప్రభుత్వం నుండి నిధులను కేటాయించే విధంగా తన వంతు కృషి చేస్తానన్నారు. క్రీడల నిర్వహణ కోసం ఎందరో దాతలు ముందుకు వచ్చి తమవంతుగా సహాయ సహకారాలు అందజేశారని, వారందరికీ కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు బాజిరెడ్డి జగన్ మోహన్ వెల్లడించారు. కార్యక్రమంలో సర్పంచ్ పాశం సత్తెవ్వ నర్సింలు, సర్పంచుల ఫోరం మండలాధ్యక్షులు లోలం సత్యనారాయణ, మోహన్‌రెడ్డి, నరేష్, ఎంపీటీసీ మారంపల్లి సుధాకర్, సహకార సొసైటీ చైర్మన్ చింతలపల్లి గోవర్ధన్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు చిలువేరి గంగాదాస్, పాఠశాల చైర్మన్ నమాల గంగాధర్, బీఆర్ఎస్ రూరల్ ఎస్సీ కన్వీనర్ పాశం కుమార్, మండల విద్యాశాఖాధికారి శ్రీనివాస్‌రెడ్డి, లోకాని గంగారాం, మొచ్చ గోపాల్, అరటి రఘు, రాజు నాయక్, ఇందల్‌వాయి మండల పిఈటీలు, అధ్యాపకులు, గ్రామస్తులు, విడిసి సభ్యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



కప్‌ను అందజేస్తున్న జడ్పీటీసీ

సీఈఐఆర్ ద్వారా ఫోన్ అప్పగింత

నవతెలంగాణ-భీంగల్

సీఈఐఆర్ సాంకేతికత ద్వారా భీంగల్ పోలీసులు పోయిన ఫోన్‌ను పట్టుకొని బాధితునికి అందజేశారు. పట్టణ కేంద్రానికి చెందిన కిరాణా అనే వ్యక్తి తన ఐక్యూ మొబైల్ ఫోన్ పోయిందనే ఫిర్యాదుతో సిఈఐఆర్ ద్వారా నెల్లూరులో ఉన్నట్లు గుర్తించి దానిని స్వాధీనం చేసుకొని గురువారం ఎస్సై హరిబాబు బాధితునికి అందజేశారు. ఇందుకు కృషి చేసిన కానిస్టేబుల్ సుధీర్, రాజ్‌కుమార్‌ను ఎస్సై అభినందించారు.



ఫోన్ అప్పగిస్తున్న ఎస్ఐ

వసతి గృహాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- ఇన్చార్జి కమిషనర్ రాజేందర్



మాట్లాడుతున్న ఇంచార్జి కమిషనర్

నవతెలంగాణ-భీంగల్

వసతి గృహాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ ఇన్చార్జి కమిషనర్ మెప్మా పీడీ రాజేందర్ అన్నారు. గురువారం పట్టణ కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో చైర్ పర్సన్ కన్నె ప్రేమలత సురేందర్ అధ్యక్షతన సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ కమిషనర్, మెప్మా పీడీ రాజేందర్ మాట్లాడుతూ హాస్టల్లో అపరిశుభ్రతకు తావివ్వకుండా పరిసరాలన్నీ పరిశుభ్రంగా ఉంచుకోవాలని వార్డెన్‌లకు ఆదేశించారు. అలాగే విద్యార్థులకు అందజేస్తున్న భోజనాన్ని పరిశీలించి నాణ్యమైన భోజనం అందించే విధంగా తగుచర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు భోజన నిర్వాహకులు చేస్తున్న వంటలు ఎప్పటికప్పుడు పరిశీలించాలని తెలియజేశారు. ఈ సభలో పలు అంశాలను కౌన్సిల్ ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఇటీవల ఆర్డీవోగా పదోన్నతి పొంది మెప్మా పీడీగా నియమితులైన ఇన్చార్జి కమిషనర్ రాజేందర్‌ను పురపాలక కార్యవర్గం, సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ సమావేశంలో తహసిల్దార్ వెంకటరమణ, వైస్‌చైర్మన్ గున్నాల బాలభగత్, కౌన్సిలర్ సతీష్ గౌడ్, బోదిరె నర్సయ్య, ధరావత్ లింగయ్య, మల్లెల రాజశ్రీ, మూతలత తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బా పాఠశాలను పరిశీలించిన కమిషనర్

కస్తూర్బాగాంధీ పాఠశాలను మున్సిపల్ చైర్ పర్సన్ కన్నె ప్రేమలత సురేందర్, వైస్ చైర్మన్ భగత్‌తో కలిసి కమిషనర్ రాజేందర్, కౌన్సిలర్లు కలిసి పరిశీలించారు. హాస్టల్లో పరిశుభ్రత పాటించాలని ప్రత్యేక అధికారికి సూచించారు.

నల్ల కండువాలతో టీడీపీ నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న టీడీపీ నాయకులు

నవతెలంగాణ-మాక్లూర్

తెలంగాణ తెలుగుదేశం పార్టీ నిజామాబాద్ పార్లమెంట్ అధ్యక్షులు దేగాం యదాగౌడ్ ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ ఆర్మూర్ నియోజకవర్గంలోని మాక్లూర్ మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం ఎదుట నల్ల కండువాలతో గురువారం నిరసన చేపట్టారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పార్లమెంట్ అధ్యక్షులు దేగాం యదాగౌడ్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టు, చట్ట విరుద్ధంగా జగన్ ప్రభుత్వంలో జగన్ తన జైలు జీవితాన్ని గుర్తుతెచ్చుకుంటూ తను చేసిన అక్రమాలను అవినీతిని కప్పిపుచ్చుకుంటూ, తను 16 నెలలు జైలులో ఉన్నది గుర్తుకు తెచ్చుకొని, కక్షపూరితంగా నిప్పులాంటి మనిషి అవినీతి మరకలేని జాతీయస్థాయిలో మంచి నాయకుడిగా గుర్తింపు తెచ్చుకున్న నారా చంద్రబాబు నాయుడు మీద కక్ష పెంచుకొని బురద జల్లాలని దురుద్దేశంతో వ్యవస్థలను అడ్డుపెట్టుకొని అతనికి కూడా అవినీతి మరకలు పూయాలని విశ్వ ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఎన్నికలలో ఓడిపోతానని భయంతో, లేనిపోని కేసులు పెట్టి ఎలాగైనా జైలు పాలు చేయాలని చూస్తే తెలుగు ప్రజలు ఊరుకోరని వచ్చే ఎలక్షన్లో ఓటుతో బుద్ధి చెబుతామని అన్నారు. కార్యక్రమంలో నిజామాబాద్ అర్బన్ ఇంచార్జ్ వినోద్ కుమార్, నిజామాబాద్ రూరల్ ఇంచార్జ్ నాగేశ్వరరావు, రాష్ట్ర అనుబంధ సంఘ నాయకులు కోయేడి నర్సింలు, ఫిరోజ్, అనుబంధ సంఘ అధ్యక్షులు బొబ్బ నర్సింహ, దంతాల ఆనందు, పార్టీ సీనియర్ నాయకులు శంకర్ ముదిరాజ్, లవంగ రాజు, రవికుమార్ పాటిల్, నాగేశ్వరరావు, మాక్లూరు మండల నాయకులు శ్రీను, గాంధీ గౌడ్, అభిమన్యు, బాలరాజ్ గౌడ్, ఇస్సాపల్లి రవి, భారత్, ఫత్తేపూర్ శ్రీను, వెంకటేశ్వరరావు, శ్రీనివాస్‌రెడ్డి, తరుణ్, సాయిబాబా, రామకృష్ణ రెడ్డి, సురేందర్‌రెడ్డి, భాస్కర్, కార్తీక్, అతిక్ అహ్మద్, షేక్ ఖలీమ్, బాపురావు, కాకా విజయ్ భాస్కర్, భగవంత్ రావ్, నాయుడు వెంకన్న, రంగారావు, సద్గుణ రావ్, నిమ్మగడ్డ తరుణ్, వేముల నాగేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించిన వైస్ ఎంపీపీ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని చౌట్‌పల్లి ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం మండల పరిషత్ ఉపాధ్యక్షుడు కాలేరు శేఖర్ సందర్శించి పరిశీలించారు. ఆస్పత్రికి వైద్య సేవల కోసం వచ్చిన రోగులతో ఆయన మాట్లాడారు. ఆస్పత్రి దారు అందుతున్న సేవలను, ఆస్పత్రిలో సౌకర్యాల గురించి వాకబు చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా ప్రజలకు అందిస్తున్న వివిధ రకాల వైద్య సేవలను గురించి ఆసుపత్రి వైద్యురాలు డాక్టర్ సుప్రియను అడిగి తెలుసుకున్నారు. వైద్యం కోసం వచ్చే రోగులకు మెరుగైన సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. ఉత్తమ ప్రభుత్వ ఆసుపత్రిగా ఉన్న పేరు నిలబెట్టేందుకు వైద్యులు, సిబ్బంది కృషి చేయాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలోనే ప్రసవాలు ఎక్కువ జరిగేలా ప్రజలకు అవగాహన కల్పించేందుకు వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు తగిన విధంగా కృషి చేయాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవం చేయించుకుంటే కలిగే ప్రయోజనాలను గర్భిణీలకు వారి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పిస్తే ప్రభుత్వ ఆసుపత్రిలోనే ఎక్కువగా ప్రసవాలు జరిగేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి చింత సత్యనారాయణ, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

6వ వార్డులో పండ్లు, పూల మొక్కలు పంపిణీ

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని 26వ వార్డు రాజారాం నగర్ కాలనీలో గురువారం హరితహారం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి పండ్ల, పూల మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక కౌన్సిలర్ ఎస్సార్ సుజాత మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని, స్థానిక ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి కృషితో నియోజకవర్గ అభివృద్ధి శరవేగంతో జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌పి సమత, కార్యదర్శి మందుల రుక్మాబాయి, సంఘ సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.